# స్థానిక ఇన్స్టిట్యూట్ చేతిపుస్తకము

shepherds
GLOBAL CLASSROOM

కాపీరైట్ © 2022 Shepherds Global Classroom
ఈ వెబ్సైటులో ఉచితముగా డౌన్లోడ్ చేసుకోవచ్చు, https://www.shepherdsglobal.org/downloads

వేరుగా ప్రస్తావిస్తే తప్ప, ఈ కోర్సు ది క్రియేటివ్ కామన్స్ యాట్రిబ్యుషన్-నాన్ కమర్షియల్-నాన్ డిరవేటివ్స్ (CC BY-NC-ND 4.0) ద్వారా అందుబాటులోనికి తేబడినది. https://creativecommons.org/licenses/by-nc-nd/4.0/

ఈ కోర్సును ముద్రణ మరియు డిజిటల్ రూపములో కాపీ చేసి, పంచిపెట్టవచ్చుగాని, ఏ మార్పు చేర్పులు చేయకూడదు, లాభము కొరకు అమ్మకూడదు (ముద్రణ ఖర్చులను సేకరించవచ్చు). విద్యా సంస్థలు ఫీజు తీసుకొనుచున్నప్పటికీ ఈ కోర్సును ఉపయోగించవచ్చు/కాపీ చేయవచ్చు. అధిక సమాచారం కొరకు, ఈ వెబ్సైటును చూడండి www.shepherdsglobal.org/copyright

ముఖ్య రచయిత: డా. స్టీఫెన్ కే. గిబ్సన్

# విషయములు


తర్ఫీదు కొరకు ఈ చేతిపుస్తకమును ఉపయోగించుట 5

1. స్థానిక పరిచర్య తర్ఫీదు యొక్క ప్రాముఖ్యత 7

2. షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ నకు పరిచయం 13

3. ఒక సామర్థ్యతగల బోధకుని అర్హతలు 17

4. మన విద్యార్థులను అర్థము చేసుకొనుట 21

5. మంచి బోధనా పద్ధతులు 25

6. SGC కోర్సులను ఎలా బోధించాలి 29

7. బోధకులను కనుగొనుట 33

8. స్థానిక షెఫర్డ్స్ ఇన్స్టిట్యూట్ ను నిర్వహించుట 37

SGC నుండి ఆన్లైన్ వనరులు 42

షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ కోర్సు వర్ణనలు 43

# తర్ఫీదు కొరకు ఈ చేతిపుస్తకమును ఉపయోగించుట



ఈ చేతి పుస్తకము ప్రధానముగా తర్ఫీదుదారులు, పాలకులు, మరియు స్థానిక బోధకులకు రిఫరెన్స్ గైడు వలె ఉన్నది. కొన్నిసార్లు తర్ఫీదుదారులు ఈ చేతిపుస్తకమును ఒక కోర్సు వలె ఉపయోగించి, స్థానిక ఇన్స్టిట్యూట్ల యొక్క బోధకులు మరియు పాలకులను తర్ఫీదు చేయవచ్చు. మరికొన్నిసార్లు, ఒక అంశమును గూర్చి తర్ఫీదు చేయుటకు లేక షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ ను పరిచయం చేయుటకు వ్యక్తిగత భాగములను ఉపయోగించవచ్చు.

ఒక తర్ఫీదు సమయములో చేతిపుస్తకమంతటిని బోధించుటకు సుమారుగా ఆరు గంటలు పడుతుంది. సంభాషణ కొరకు తర్ఫీదుదారులు తరచుగా ఆగవలసియుంటుంది.

తర్ఫీదుపొందువారి యొద్ద బైబిళ్ళు, వ్రాయు సామగ్రి, మరియు ఈ చేతిపుస్తకము యొక్క కాపీ ఉండాలి.

విద్యార్థులు పరీక్షించుటకు తర్ఫీదుదారులు పలు రకముల SGC కోర్సులను తీసుకొనిరావాలి. ముగ్గురు ముగ్గురుగా విద్యార్థులు గుంపులలో బోధించుటను అభ్యసించుటకు ప్రతి కోర్సు యొక్క మూడు కాపీలు కనీసం తరగతి'లో ఉండాలి.

తర్ఫీదుదారులు 6వ అధ్యాయమును బోధించిన తరువాత, విద్యార్థులు SGC కోర్సులను చూడాలి. కోర్సుల యొక్క ఆరంభములో ఇవ్వబడిన పలు నిర్దేశనములను వారు చూడాలి. విద్యార్థులు ఆ నిర్దేశనములను చర్చించి, వాటిని గ్రహించునట్లు చూచుకోవాలి.

అభ్యాసము మరియు ఆచరణ తర్ఫీదుకు కీలకమైయున్నవి. కోర్సులలో నుండి మూడు పాఠములను బోధించుట ద్వారా ఎలా బోధించాలో తర్ఫీదుదారుడు కనుపరచవచ్చు. ప్రతి పాఠం ఒక భిన్నమైన కోర్సు నుండి తీసుకుంటే ప్రదర్శన ఉత్తమమైన రీతిలో ఉంటుంది. ఒకరి కంటే ఎక్కువ తర్ఫీదుదారులు లేక ప్రవీణులైన విద్యార్థులు అందుబాటులో ఉంటే, పలు శైలులను కనుపరచుటకు వారు పాఠములను బోధించవచ్చు.

ప్రదర్శనను గమనించిన తరువాత, ఈ కోర్సు యొక్క విద్యార్థి బోధనను అభ్యసించవలసియుంటుంది.

కనీస అభ్యాసమును ఈ విధముగా క్రమపరచవచ్చు: విద్యార్థులను ముగ్గురు ముగ్గురుగా విభాగించండి. సమూహములో ప్రతి విద్యార్థి 30 నిమిషాల కంటే తక్కువ సమయములో మరొక ఇద్దరికి పాఠమును బోధించాలి. ముగ్గురు విధ్యార్థులలో ఒకొక్కరు 90 నిమిషాలలో మిగిలిన ఇద్దరు విద్యార్థుల అభ్యాసమును గమనించి, దానిని అనుకరిస్తారు.

బోధకుడు మరియు ఇతర విద్యార్థుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొనుచు విద్యార్థుల అభ్యాసమునకు ఒక ప్రత్యేకమైన తర్ఫీదు దినమును అంకితం చేయుట ఉత్తమమైన అలవాటు. ఈ అభ్యాస దినమును అవసరమైతే తరువాత ఏదో ఒక రోజు ఏర్పాటుచేయవచ్చు. అదనపు సమయము విద్యార్థులు సిద్ధపడుటకు అవకాశం ఇస్తుంది.

## అధ్యాయము 1

# స్థానిక పరిచర్య తర్ఫీదు యొక్క ప్రాముఖ్యత

### పరిచయం

**సంఘము బోధించవలెను.** ప్రతి చోట తన ఆజ్ఞలను బోధించమని యేసు సంఘమునకు చెప్పాడు (మత్తయి 28:19). ఒక కాపరి బోధించువానిగా ఉండాలని పౌలు చెప్పాడు (1 తిమోతి 3:2). ఈ బోధన శిష్యరిక కార్యములో భాగముగా ఉన్నది. విశ్వాసులుగా ఎలా జీవించాలో, దేవుని మహిమ కొరకు ఎలా జీవించాలో సంఘము ప్రజలకు బోధిస్తుంది. ఈ బోధన విశ్వాసి ఉన్న ప్రతి చోట జరగాలి. బలమైన సంఘములలో తమ ప్రజలకు బోధించుటకు బైబిలానుసారమైన సత్యములు మరియు ఆచరణాత్మక పద్ధతులు ఉంటాయి.

**సంఘము తర్ఫీదు చేయాలి.**

> నీవు అనేక సాక్షులయెదుట నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము (2 తిమోతి 2:2).

బోధించు అవసరత పరిచర్య తర్ఫీదు కొరకు అవసరతను కూడా సృష్టిస్తుంది. ఇతరులకు బోధించగల పురుషులను తర్ఫీదు చేయమని పౌలు తిమోతికి చెప్పాడు (2 తిమోతి 2:2). తర్ఫీదు చేయుట అంటే కేవలం సమాచారమును బోధించుట మాత్రమే కాదు. తర్ఫీదు అంటే విశ్వాసుల స్వప్రయోజనము కొరకు వారికి బోధించుట మాత్రమే కాదు. తర్ఫీదు ఇతరులకు సహాయము చేయుటకు విశ్వాసులను సిద్ధపరుస్తుంది.

యేసు పరిచర్య తర్ఫీదు యొక్క ప్రాధాన్యతను కనుపరచాడు. ఆయన పరిచర్య ఆరంభములో, ఆయన సంఘమును నడిపించు మరియు వ్యాపింపజేయు కొందరు పురుషులను ఎన్నుకున్నాడు. ఆయన తన సమయమంతటిని జనసమూహములకు బోధించుచు గడపలేదు; బదులుగా, పన్నెండు మంది నాయకులను తర్ఫీదు చేయుటకు ఆయన తరచుగా సమయము వెచ్చించాడు. ఆయన తర్ఫీదుచేసిన వారి ద్వారా ఆయన తన పరిచర్యను వ్యాపింపజేశాడు.

**షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ స్థానిక సేవకుల కొరకు ఇతరులకు బోధించదగిన తర్ఫీదు కార్యక్రమమును అందిస్తుంది.**

## స్థానిక పరిచర్య తర్ఫీదు కొరకు ఉద్దేశ్యములు

### కాపరులను తర్ఫీదు చేయుట

కాపరులకు సిద్ధాంతము, బైబిలు వ్యాఖ్యానము, ప్రసంగము, మరియు శిష్యరిక పద్ధతులలో తర్ఫీదు చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్నివేల సంఘములను ఎలాంటి ముద్రించబడిన వనరులు మరియు ఏ విధమైన సరియైన తర్ఫీదులేని కాపరులు నడిపించుచున్నారు. అనేకమంది కాపరులు తర్ఫీదుపొందలేదు మరియు ఇతరులను తర్ఫీదుచేయుటకు సమర్థులుగా భావించుకోరు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలామంది కాపరులు బైబిలు కళాశాలలో చదవలేరు. వారు తమ కుటుంబములు, ఉద్యోగాలు, మరియు పరిచర్యలను విడిచి, అనేక సంవత్సరుల పాటు తరగతులలో పాలుపంచుకొనుట సాధ్యము కాదు.

## సాక్ష్యమిచ్చువారిని తర్ఫీదు చేయుట

దేవుని రక్షించు కృపను అనుభవించిన ప్రతి వ్యక్తి సువార్త ప్రకటించుటకు అర్హుడే. వారి కొరకు దేవుడు ఏమి చేశాడో ప్రజలు చెప్పగలరు. వారి సాక్ష్యములు బలముగా ఉంటాయి, ముఖ్యముగా వారికి పరిచయస్థులైన ప్రజలకు మరియు వారి జీవితములలోని మార్పును చూడగల ప్రజలను ఒప్పించునవిగా ఉంటాయి.

అయితే, కొన్నిసార్లు సువార్తలోని ముఖ్యమైన బిందువులను ఒక వ్యక్తి వివరించలేడు. ఆ వ్యక్తి యొక్క సాక్ష్యమునకు మరియు వినువారి పరిస్థితులకు పొంతనలేకపోతే, అదే మార్పును వారు కూడా ఎలా అనుభవించగలరో వారు అర్థము చేసుకోలేకపోవచ్చు.

అతడు క్రైస్తవ్యమును గూర్చిన ప్రశ్నలకు జవాబు ఇవ్వలేకుండా ఉన్నాడు కాబట్టి, అనేక సంవత్సరములుగా విశ్వాసిగా ఉన్న వ్యక్తి కూడా తన సముదాయమునకు సువార్త ప్రకటించు విషయములుగా అసమర్థునిగా భావించుకుంటాడు. ఈ విశ్వాసికి అతని లేక ఆమె వ్యక్తిగత మారుమనస్సు అనుభవము, ఆరాధనా భావనలు, క్రీస్తు శరీరములోని ఇతరులతో సహవాసము చేయుటలోని ఆనందము తెలుసుగాని, వాటిని అతడు వివరించలేడు.

కొన్నిసార్లు ఆ సమాజములోని ప్రజలు క్రైస్తవ్యమును వ్యతిరేకించు మతమునకు చెందినవారు కావచ్చు. మంచి జీవితము జీవించు క్రీస్తు అనుచరులను గౌరవించుటను వారు నేర్చుకోవచ్చుగాని, క్రైస్తవ విశ్వాసము యొక్క వివరణలను కూడా వారు వినవలసియున్నది.

సువార్త నియమములను మరియు సువార్తకు మద్దతునిచ్చు మౌలిక సిద్ధాంతములను నేర్చుకొనుట ద్వారా ఆ వ్యక్తి ప్రభావంతమైన సాక్షిగా ఉండగలడు.

## సంఘమును కాపాడుట

హిత బోధతో తమ సంఘములను కాపాడుకొనుట కాపరుల బాధ్యత (తీతు 1:9-14). అబద్ధ సంఘములు మరియు అబద్ధ మతములు ప్రజలకు సందిగ్ధతను కలిగించు మరియు మోసగించు ఆలోచనలను ఉపయోగిస్తాయి. ఒకసారి మారుమనస్సుపొందిన ప్రజలు మరలా అబద్ధ సంఘములలోనికి నడిపించబడుట చాలా బాధాకరం.

ప్రజలు వారి విశ్వాసములో స్థిరపరచబడునట్లు కాపరి ప్రజలకు బైబిలు సిద్ధాంతమును బోధించవలసియున్నది. బోధన అనునది ఉద్దేశ్యపూర్వకముగాను క్రమముగాను ఉండి, సంఘములోని ప్రజలందరిని చేరుట కొరకు పలు స్థాయిలలో ఇవ్వబడునదిగా ఉండాలి.

## పరిచర్య బృందమును వ్యాపింపజేయుట

ఒక ఆట జట్టులో ఎల్లప్పుడూ ఆటలో పాలుపంచుకొని అదనపు ఆటగాళ్లు బెంచి మీద కూర్చొని ఉంటారు. వారు ప్రముఖ ఆటగాళ్ల కంటే చిన్నవారు మరియు తక్కువ అనుభవముగలవారు కావచ్చు, కాని వారు తర్ఫీదు పొందుతున్నారు. వారిలో కొందరికి కొన్ని సమయాలలో అవసరమైయ్యే ప్రత్యేకమైన సామర్థ్యతలు ఉంటాయి.

ఒక ఆరోగ్యకరమైన, ఎదుగుతున్న సంఘమునకు కూడా "బెంచ్" ఉండాలి. నాయకత్వ స్థానములన్నిటిలో ప్రజలు ఉన్నారు కాబట్టి, జట్టు సంపూర్ణముగా ఉన్నది అని ఆలోచించుట పొరపాటు. నూతన విధములైన పరిచర్యలను ఆరంభించుటలో

సహాయము చేయుటకు నాయకులు ఉంటే తప్ప పరిచర్య ఒక ఉన్నత స్థాయిని చేరినప్పటికీ, ఎదుగుదలలో ముందుకు కొనసాగలేదు.

ఆరోగ్యకరమైన సంఘములో అభివృద్ధిచెందుతున్న మరియు అభ్యసించుచున్న "బెంచి" మీద ఉన్న ప్రజలు కావాలి. దీనికి స్థానిక తర్ఫీదు అవసరం. కాబట్టి, పరిచర్య తర్ఫీదు అనునది కేవలం పరిచర్య స్థానములను కలిగియున్నవారి కొరకు మాత్రమే కాదు.

స్థానిక తర్ఫీదు జరుగునట్లు చేయుట ఒక కాపరి యొక్క బాధ్యత అయ్యున్నది. కాపరి స్వయంగా తర్ఫీదు అంతటిని ఇవ్వలేడు, కాబట్టి అతడు దానిని నిర్వహించు, దానిని ప్రోత్సహించాలి. పలు పాత్రలను పోషించు ప్రజల బృందము అతనికి కావాలి.



మనమందరము విశ్వాసవిషయములోను దేవుని కుమారునిగూర్చిన జ్ఞానవిషయములోను ఏకత్వముపొంది సంపూర్ణపురుషులమగువరకు, అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు, ఆయన ఈలాగు నియమించెను. పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభి వృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలులనుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులనుగాను, కొందరిని కాపరులనుగాను ఉపదేశకులనుగాను నియమించెను. అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయో పాయములచేత వంచనతోను, తప్పుమార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొనిపోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగురగొట్టబడినవారమైనట్లుండక, ప్రేమ గలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము (ఎఫెసీ. 4:11-15).

సంఘము యొక్క పనిని పూర్తి చేయుటకు కావలసిన వరములను మరియు సామర్థ్యతలను దేవుడు స్థానిక సంఘములోని ప్రజలకు ఇస్తాడు. ప్రజలను అభివృద్ధిచేయు బాధ్యతను సంఘము ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోవాలి.

## స్థానిక సంఘమును బలపరచుట

స్థానిక సంఘము అంటే స్థానిక ప్రజలు నడిపించు, స్థానిక ప్రజలు మద్దతునిచ్చు, స్థానిక ప్రజల యాజమాన్యములో ఉన్న సంఘము. అది విదేశీ మద్దతు లేక మార్గదర్శకము మీద ఆధారపడదు. సంఘముల యొక్క ఆరోగ్యము మరియు ఎదుగుదలకు స్థానిక బలము ప్రాముఖ్యమైయున్నది.

స్థానిక సంఘము దాని సంస్కృతిలో నాటబడియుంటుంది. అది ఒక విదేశీ సంఘము వలె ఉండదు.

ఆరోగ్యకరమైన స్థానిక సంఘమునకు అనేక ప్రయోజనములు ఉన్నాయి:

1. అది దాని సంస్కృతిలో ప్రభావవంతముగా సువార్త ప్రకటిస్తుంది మరియు శిష్యులను చేస్తుంది.

2. విదేశీయుల మీద ఆధారపడకుండా క్రీస్తు శరీరముగా సంఘము పరిపక్వత చెందుతుంది మరియు నిర్వహించబడుతుంది.

3. నాయకులు వారి సంపూర్ణ సామర్థ్యతను బలపరచుకుంటారు.

4. స్థానిక సభ్యులు పరిచర్య కొరకు మద్దతుని మరియు జవాబుదారుతనమును అందిస్తారు.

కొన్ని స్థానిక సంఘములలో సిద్ధాంతిక స్థిరత్వము మరియు క్రైస్తవ జీవనమునకు బైబిలు ప్రమాణములు కొరతగా ఉంటాయి కాబట్టి అవి ఆరోగ్యకరముగా ఉండవు. ఒక బలమైన, స్థిరమైన సాక్ష్యముతో తమ సమాజములను ప్రభావితము చేయు విషయములో వారు విఫలమవుతారు. ప్రతిభలు ఉన్నను, ప్రవర్తన విషయములో బలహీనులుగా ఉండుట వలన వాటి నాయకులు బలహీనులుగా ఉంటారు. నాయకత్వ అభివృద్ధి కొరకు మంచి కార్యక్రమములువాటిలో ఉండవు. స్థానిక పరిచర్య తర్ఫీదు కొరకు వాటికి మంచి కార్యక్రమములు అవసరము.

ఒక సంఘము తుదకు స్థానిక సంఘము అవుతుంది అను లక్ష్యముతో కొన్నిసార్లు విదేశీ మిషనరీలు దానిని ప్రారంభించవచ్చు. స్థానిక మద్దతు పెరుగుట మరియు స్థానిక నాయకుల యొక్క ఎదుగుచున్న బాధ్యత ద్వారా ప్రగతిని కొలవవచ్చు.

స్థానిక నాయకుల యొక్క అభివృద్ధి కొరకు స్థానిక తర్ఫీదు అవసరము, వారు సిద్ధాంతమును బోధిస్తారు, ఆచరణాత్మక జీవనమునకు విశ్వాసమును అనువర్తిస్తారు, మంచి పరిచర్య శైలులను మరియు వ్యూహములను బలపరుస్తారు.

## సంఘములను స్థాపించుట

అనేక సంఘమును ఇతర సమాజములకు సువార్తను పంపకుండానే కొన్ని సంవత్సరముల పాటు మనుగడలో ఉండుట బాధాకరమైన విషయం. సంఘములు లేని చోట్లకు సంఘములు సువార్తికుల బృందములను తర్ఫీదు చేసి పంపాలి. సంఘముగా మారు నూతనముగా మారుమనస్సుపొందిన సమూహమును సిద్ధపరచుట అట్టి బృందము యొక్క లక్ష్యమైయుండాలి.

మారుమనస్సుపొందిన ప్రజల సమూహము సంఘములుగా మారుటకు కొందరు సువార్తికులను తర్ఫీదు చేయాలి. క్రైస్తవ జీవితము ఎలా జీవించాలో బోధించుట ద్వారా వారు క్రొత్త విశ్వాసులను శిష్యులనుగా చేయాలి. సువార్త ప్రకటించుటకు మరియు పరిచర్య బాధ్యతలను తీసుకొనుటకు వారు మారుమనస్సుపొందినవారిని తర్ఫీదు చేయగలగాలి.

చాలా వరకు క్రొత్త సంఘములు స్థానిక వ్యక్తి ద్వారా నడిపించబడాలిగాని, సమాజములో నివసించుటకు వచ్చిన మరొక ప్రాంత కాపరి ద్వారా కాదు. అధ్యయన తర్ఫీదు ఉన్న చాలామంది కాపరులు ఒక క్రొత్త సంఘములో లేక చిన్న గ్రామములో ఉన్న సంఘములో సేవ చేయుటకు ఇష్టపడరు. సంఘమును నడిపించుటకు దేవుడు పిలచిన స్థానిక విశ్వాసికి మనము పరిచర్య తర్ఫీదును ఇవ్వాలి.

## మిషనరీలను సిద్ధపరచుట

ఒక మిషనరీ అనగా, సువార్త యొక్క ప్రభావమును వ్యాపింపజేయు ఉద్దేశ్యముతో సంఘము ద్వారా మరొక స్థలమునకు పంపబడిన వ్యక్తి. మిషనరీ అను పదము ముఖ్యముగా మరొక దేశము మరియు/లేక మరొక సంస్కృతికి వెళ్లిన వ్యక్తి కొరకు ఉపయోగించబడుతుందిగాని, కొన్నిసార్లు తన దేశములో మరొక సమాజమునకు వెళ్లిన వ్యక్తి కొరకు కూడా ఉపయోగించబడుతుంది.

లోకములోని పలు ప్రాంతములలో, ముఖ్యముగా తన దేశములోని మరొక ప్రాంతమునకు వెళ్లు మిషనరీల ద్వారా సువార్త చాలా విరివిగా వ్యాపించబడుతుంది. తర్ఫీదు వారి ప్రభావమును మరియు సిద్ధాంత స్థిరత్వమును పెంచుతుంది.

10/40 విండో అనగా భూమధ్యరేఖలో దక్షిణ చిక్కున 10 డిగ్రీల నుండి ఉత్తర దిక్కున 40 డిగ్రీల వరకు వ్యాపించిన ప్రాంతమైయున్నది, ఇది ముఖ్యముగా ఉత్తర ఆఫ్రికా నుండి దక్షిణ ఆసియా వరకు వ్యాపిస్తుంది, చైనా మరియు భారత దేశము దీనిలో భాగమైయున్నాయి. 10/40 విండోలో ప్రపంచములోని అరవై ఆరు శాతం మంది ప్రజలు నివసించుచున్నారు. 10/40 విండోలోని ప్రజలలో 80% కంటే ఎక్కువమంది ప్రజలు ఇంకా సువార్తను వినలేదు.

వాటిలోని పెద్ద పట్టణములలో అనేక సంవత్సరములుగా సంఘములు ఉన్నప్పటికీ, ప్రపంచములోని కొన్ని దేశములలో ఇంకా సువార్త వ్యాపించలేదు. ఒక వ్యక్తి ఒక సంఘములో అనేక సంవత్సరముల పాటు సేవ చేయవచ్చుగాని, ఒక క్రొత్త స్థానములో పరిచర్యను ఎలా ఆరంభించాలో తెలియకపోవచ్చు. సంఘ భవనము లోపల చిన్న విశ్వాసుల సమూహముతో ఎలా మాట్లాడాలి అను విషయము మాత్రమే అతనికి తెలుసు. సువార్త సందేశమును పంచుటకు మరియు స్థానిక విశ్వాసుల కుటుంబమును రూపించాలనే లక్ష్యమును కలిగియుండుటకు సంఘము మిషనరీలను తర్ఫీదు చేయాలి.

## అధ్యాయము 2

# షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ నకు పరిచయం

### షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ యొక్క దర్శనం

లోకములో ప్రతి చోట స్థానిక పరిచర్య తర్ఫీదును అందుబాటులోనికి తెచ్చుట ద్వారా క్రీస్తు సంఘమును సిద్ధపరచుట SGC యొక్క దర్శనమైయున్నది.

ఉబెర్ అను పేరుగల టాక్సీ కంపెనీ ప్రతి రోజు యాభై ఐదు లక్షలమంది ప్రయాణికులను రవాణా చేస్తుంది. ఇలా చేయుటకు కార్లు మరియు అనేకమంది డ్రైవర్లు అవసరమైయున్నది. ఉబెర్ కొన్ని వేల కార్లను కొనలేదు; బదులుగా, ఉబెర్ ప్రయాణికులను రవాణా చేయుటకు వారు స్థానిక డ్రైవర్లను మరియు వారి సొంత కార్లను ఉపయోగించారు. వారి వ్యాపారము కొరకు కార్మిక సమస్యను వారు పరిష్కరించుకున్నారు. అదే విధముగా, ఇప్పటికే స్థానికముగా అందుబాటులో ఉన్న బోధకులను సిద్ధపరచుటకు ద్వారా SGC ప్రతిచోట తర్ఫీదును అందుబాటులోనికి తెస్తుంది. స్థానిక విశ్వాసులకు దేవుడు బోధించు సామర్థ్యతను మరియు ఆశను అనుగ్రహించాడు.

### సిద్ధాంతిక పునాది

SGC ఏ డినామినేషన్ తోను అనుబంధము కలిగిలేదు. మేము నైసియా, చాల్సిడోనియన్, మరియు అథనేషియన్ విశ్వాస ప్రమాణములలో వ్యక్తపరచబడిన చారిత్రిక త్రిత్వ సిద్ధాంతములను నమ్ముతాము. మేము బైబిలు యొక్క సంపూర్ణ అధికారమును అనుసరిస్తాము. మేము కృప, విశ్వాసము, మరియు రక్షణ అను ఇవాంజెలికల్ సిద్ధాంతములను నమ్ముతాము. ఒక విశ్వాసిలో దేవుని కృప కార్యము అతనిని పరిశుద్ధమైన హృదయము మరియు విజయవంతమైన జీవితములోనికి నడిపిస్తుంది అని మేము నమ్ముతాము.

### ఉద్దేశ్యపూర్వక కోర్సు డిజైన్

అర్హతగల స్థానిక బోధకులను పరిచర్య తర్ఫీదు కొరకు త్వరగా సిద్ధపరచు ప్రత్యేకమైన పాఠ్యాంశములు వారికి అవసరమైయున్నవి.

- ఇది 20 కోర్సులలో ఇవాంజెలికల్ సిద్ధాంతమును పూర్తిగా బోధిస్తుంది.
- దీనిని అర్హతగల, అనుభవముగల, బహుళ సంస్కృతి తర్ఫీదుదారులు అభివృద్ధిచేశారు.
- ఇది ఏ సంస్కృతిలోనైనా ఉపయోగకరమైనది.
- దీనిని స్పష్టమైన, సులువైన భాషలో వ్రాయుట జరిగింది.
- ఇది డినామినేషన్ భిన్నత్వములు లేకుండా ఇవాంజెలికల్ సత్యమును ఉద్ఘాటిస్తుంది.
- ఇది ఆచరణాత్మకమైనది, జీవితము మరియు పరిచర్య కొరకు ఔచిత్యమైనది.
- దీనిని పలు నేపథ్యములు మరియు పలు సమూహములకు అనువర్తించవచ్చు.
- ఇది పలు భాషలలో అందుబాటులో ఉన్నది.

- స్థానిక సంఘములకు దేవుడిచ్చిన వరములను ఇది ఉపయోగిస్తుంది.
- స్థానిక కార్యక్రమాలను స్థిరపరచు నాయకులను తర్ఫీదుదారులుగా ఉండుటకు సిద్ధపరుస్తుంది.
- విద్యార్థులు ఇతరులకు బోధించునట్లు ఇది త్వరత్వరగా సిద్ధపరుస్తుంది.
- ఇది సమూహ అధ్యయనము కొరకు రూపొందించబడినదిగాని, వ్యక్తిగత అధ్యయనము కొరకు కూడా ప్రయోజనకరమైనది.
- డిజిటల్ రూపము కూడా ఇది ఉచితముగా అందుబాటులో ఉన్నది.
- దీనికి ఏ ఇతర పాఠ్యపుస్తకములు అవసరములేదు.

కోర్సు రచయితలకు అదనపు అధ్యయన తర్ఫీదు, బోధనా అనుభవము, మరియు బహుళ-సంస్కృతులలో పరిచర్య అనుభవము ఉన్నవి.



SGC కోర్సులో మినిస్ట్రీ ఇన్స్టిట్యూట్ ప్రోగ్రాంలోని ప్రాముఖ్యమైన విషయములు ఉన్నవి. పలు సమూహములకు, అనగా కాపరుల తరగతి లేక హోం బైబిల్ అధ్యయన సమూహములకు బోధించుటకు ఇవి సహాయకరమైయున్నవి.

స్థానిక తర్ఫీదు కార్యక్రమమును నిర్వహించుటకు స్థానిక బోధకులను త్వరత్వరగా సిద్ధపరచుటకు కోర్సులు రూపొందించబడినవి. ఆత్మీయ పరిపక్వత, బైబిలు జ్ఞానము, మరియు బోధించు వరముగల వ్యక్తి ఎలాంటి విరివైన తర్ఫీదు లేకుండా బోధించగలడు.

సంభాషణ ప్రశ్నలు మరియు అభ్యాసములతో బోధించుటకు సులువుగా ఉండునట్లు కోర్సులు రూపించబడినవి. అభ్యాసము కొరకు విద్యార్థులు బోధించు కొన్ని భాగములు ఉన్నాయి. ప్రతి కోర్సు యొక్క సగటు పొడవు 160 పేజీలు, మరియు ఇవి 7-19 పాఠములుగా విభాగించబడినవి.

SGC పాఠ్యాంశములు సంఘము యొక్క పనిని నెరవేర్చుటకు విలువైన పరికరముల బాక్సు వలె ఉన్నవి.

గమనిక: విద్యార్థులకు ముందు నుండే కొంత బైబిలు జ్ఞానము మరియు ఆత్మీయ పరిపక్వత ఉంటే బాగుంటుంది. క్రొత్త విశ్వాసులను శిష్యులనుగా చేయుట కొరకు ఈ కోర్సులు రూపొందించబడలేదు. శిష్యరికము కొరకు కల్టివేట్ డిసైపుల్షిప్ లెసన్స్ ను (SGCలో కూడా అందుబాటులో ఉన్నవి)మీరు ఉపయోగించాలని ప్రతిపాదిస్తాము.

## పరిచర్య సంబంధ నిర్మాణము

**షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్** స్థానిక తర్ఫీదును అందుబాటులోనికి తెచ్చుటకు **పరిచర్య సంస్థలు/జాతీయ పరిచర్యల** తో భాగస్వామ్యం కలిగియున్నది. ప్రతి పరిచర్య సంస్థ/జాతీయ పరిచర్య **స్థానిక ఇన్స్టిట్యూట్ లను** ఆరంభించుటలో వారికి సహాయము చేయుట ద్వారా స్థానిక సంఘములకు సేవ చేస్తుంది.

క్రింద ఇవ్వబడిన జాబితాలుక్రైస్తవ పరిచారకుల యొక్క తర్ఫీదులో పాలుపంచుకొనుచుండగా

1. షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్
2. పరిచర్య సంస్థలు/జాతీయ పరిచర్య, మరియు
3. స్థానిక ఇన్స్టిట్యూట్ ల

యొక్క భూమికలను మరియు బాధ్యతలను వర్ణిస్తుంది.

## షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ యొక్క భూమిక

- 20 పరిచర్య తర్ఫీదు కోర్సుల యొక్క జాబితాను అందిస్తుంది.
- SGC వెబ్సైటు నుండి డౌన్లోడ్ చేసుకొనుటకు కోర్సులను అందుబాటులో ఉంచుతుంది.
- కోర్సులు, వీడియోలు, మరియు తర్ఫీదు వనరులుగల SGC యాప్ ను అందిస్తుంది.
- పలు భాషలలోనికి కోర్సుల యొక్క అనువాదమును పర్యవేక్షిస్తుంది.
- బోధకుల తర్ఫీదు కొరకు కోర్సును ఇచ్చి, ప్రాంతీయ సన్నివేశముల కొరకు తర్ఫీదుదారులను పంపుతుంది.
- కోర్సులు పూర్తిచేయుట కొరకు సర్టిఫికేట్లను ఇస్తుంది.

## పరిచర్య సంస్థలు/జాతీయ పరిచర్య యొక్క భూమిక

- స్థానిక ఇన్స్టిట్యూట్లను నిర్వహించుటకు అవకాశమును సంఘములకు ఇస్తుంది.
- SGC వనరులను పరిచయం చేసి, స్థానిక ఇన్స్టిట్యూట్ల కొరకు బోధకులను తర్ఫీదు చేస్తుంది.
- స్థానిక తర్ఫీదు కార్యక్రమములను అందించుటకు SGCతో భాగస్వామ్యము కలిగియుంటుంది.
- కోర్సులను ముద్రించుట మరియు పంచుటకు సహాయపడుతుంది.
- తర్ఫీదు వనరుల కొరకు SGC వెబ్సైటు మరియు యాప్ ను ప్రతిపాదిస్తుంది.
- కన్సల్టేషన్ మరియు క్రొత్త వనరులను అందించుటకు బోధకులతో తరచుగా అనుబంధము కలిగియుండుట.
- కోర్స్ పూర్తిచేసిన సర్టిఫికేట్లను తనిఖీ చేయుట.

## స్థానిక ఇన్స్టిట్యూట్ యొక్క భూమిక

- తరగతులను నిర్వహించుటకు స్థలమును కనుగొనుట.
- స్థానిక బోధకులను ఎన్నుకొని, వీలైతే వారికి మద్దతునిచ్చుట.
- విద్యార్థులను సేకరించి, రిజిస్టర్ చేయుట.
- ప్రింట్ చేయబడిన కోర్సుల కొరకు వెలను చెల్లించుట.
- తరగతులను షెడ్యూల్ చేసి, నిర్వహించుట.

పరిచర్య సంస్థ/జాతీయ పరిచర్య మరియు స్థానిక ఇన్స్టిట్యూట్ మధ్య సంబంధమును గూర్చి అధ్యాయము 8 అదనపు వివరములను ఇస్తుంది.

## అధ్యాయము 3

# ఒక సామర్థ్యతగల బోధకుని అర్హతలు

### ప్రత్యేకమైన పరిచర్య

బోధకులు ప్రత్యేకమైన ప్రజలు. అందరూ బోధకులుగా ఉండకూడదు అని అపొస్తలుడైన యాకోబు మనలను హెచ్చరించుచున్నాడు, ఎందుకంటే బోధకులకు దేవునికి జవాబు ఇచ్చు విశేషమైన బాధ్యత ఉన్నది మరియు వారు నమ్మకముగా లేనియెడల ఖండించబడతారు (యాకోబు 3:1).

ఆ వ్యక్తి జ్ఞానమును బట్టి అతిశయపడి ఇతరులను తృణీకరించు అవకాశం ఉంటుంది అని అపొస్తలుడైన పౌలు హెచ్చరించుచున్నాడు (1 కొరింథీ. 8:1). మనలను మనము పొగుడుకొనకుండా ఇతరులను కట్టునట్లు ప్రేమ మనలను పురికొల్పుతుందని అతడు చెప్పాడు. జ్ఞానముగల ప్రజలు ఇతరులకు సహాయము చేయుటకు ఒక పరికరముగా దానిని పరిగణించాలిగాని, అది వారిని గొప్పవారిగా చేస్తుంది అని భావించకూడదు. జ్ఞానము ద్వారా వారు ఘనతను అన్వేషిస్తే, వారు తప్పుగా పురికొల్పబడి, హాని కలిగిస్తుంది.

పరిచర్య భూమికలో సేవించు లేక బోధించగోరువారికి ఈ హెచ్చరికలు ప్రాముఖ్యమైయున్నవి, ఎందుకంటే వారి జ్ఞానముతో సేవించుటకు అధ్యయనము చేయునట్లు వారు పురికొల్పబడాలి.

### మార్పు కలిగించు సత్యం

బైబిలు అధ్యయనము చేయుటకు విద్యార్థి ప్రత్యేకమైన వైఖరిని కలిగియుండాలి. వారి సొంత ప్రవర్తనను ఏ విధముగా కూడా అనువర్తించకుండా ప్రజలు విజ్ఞానమును లేక గణితశాస్త్రమును చదవవచ్చు. వారు సంపాదించు జ్ఞానము ద్వారా విద్యార్థులు మారరు. బైబిలు సత్యము భిన్నమైనది. వారు అధ్యయనము చేయుచుండగా వారి ప్రవర్తన సవాలు చేయబడుతుంది అని బైబిలు విద్యార్థులు భావిస్తారు. వారు నేర్చుకొనుచున్న సత్యముతో పొంతనకలిగియుండునట్లు వారి ప్రవర్తనను మార్చుటకు వారు వినయముతో పరిశుద్ధాత్మకు అనుమతి ఇవ్వాలి. బైబిలు సత్యము మార్పు కలిగించునది.

### SGC బోధకుని యొక్క అర్హతలు

ఈ అధ్యాయములో వర్ణించబడిన గుణములతో పాటు, బోధకుని తర్ఫీదు కోర్సులోని విద్యార్థి స్థానిక సంఘములో సభ్యునిగా ఉండాలి మరియు కాపరి యొక్క సిఫార్సును కలిగియుండాలి.

SGC బోధకుడు ఆత్మీయ పరిపక్వత, బోధించుటలో నైపుణ్యత, మరియు బైబిలు జ్ఞానము కలిగియుండాలి.

అధ్యయన అర్హతలు: బోధకుడు కోర్సు మెటీరియల్ ను చదువు, గ్రహించు, మరియు వివరించు శక్తి కలిగియుండాలి. ఒక అధ్యయన డిగ్రీ ఒక బోధకునికి ఉపదేశించు పద్ధతులు మరియు లోతైన జ్ఞానమును ఇచ్చునప్పటికీ, అదే తర్ఫీదును ఇతరులకు అందించగల బోధకులను అభివృద్ధి చేయుట SGC దర్శనమైయున్నది. ఈ కారణము చేత, అధ్యయన డిగ్రీలు

ఉన్న బోధకులను కనుగొనుట మీద మేము ఆధారపడము. ప్రతిచోట సామర్థ్యత ఉన్న బోధకులకు ఆత్మీయ వరములను ఇచ్చుటకు మేము దేవుని నమ్మకత్వము మీద ఆధారపడతాము. బోధనా సామర్థ్యతను కలిగియున్న ప్రజలను కనుగొని సిద్ధపరచాలని మేము కోరతాము.

ప్రాముఖ్యమైన మరికొన్ని గుణములు క్రింద జాబితాలో ఇవ్వబడినవి. ఒక బోధకుడు ప్రతిఒక్క గుణములోనూ ప్రావీణ్యత పొందనవసరము లేదుగాని, అన్నిటిలో అభివృద్ధి చెందుటకు ప్రయత్నించాలి. వీటిలో దేనిలోనైనా కొరతగా ఉన్న బోధకులు తక్కువ ప్రభావవంతులవుతారు.

1. **ఆత్మీయ పరిపక్వత**. బోధకుడు ఆత్మీయ గుణములకు మంచి ఉదాహరణగా ఉండాలి. బోధకుల యొక్క క్రైస్తవ జీవితములు మరియు వైఖరులు ఎల్లప్పుడూ నిలకడగా ఉండకపోతే, వారు విద్యార్థులకు మంచి మాదిరులుగా ఉండలేరు.

2. **అందుబాటులో ఉండుట**. ఒక వ్యక్తి యొక్క షెడ్యూల్ ఇప్పటికే బిజీగా ఉండి, సరిగా నిర్వహించబడలేకపోతే, అతడు లేక ఆమె తరచుగా చేయు బోధనా పరిచర్య కొరకు అందుబాటులో ఉండలేరు. బోధకులు బోధించుటకు ఒక ప్రాధాన్యతగా చేసుకొనుటకు ఆశ కలిగియుండాలి. కొందరు తలాంతులుగల ప్రజలకు ఈ పరిచర్యను అప్పగించకూడదు, ఎందుకంటే ఇతర క్రియాకలాపల ద్వారా వారి బోధనకు ఆటంకము కలిగే అవకాశం ఉంది.

3. **నమ్మదగిన**. బోధకులు వారిచ్చిన మాటను నిలబెట్టువారిగా ఉండాలి. వారు సమయమును మరియు షెడ్యూల్ ను అనుసరించువారిగా ఉండాలి. బోధకులు తరగతులకు రాకపోతే లేక ఆసల్యంగా వస్తే విద్యార్థులు విసుగుచెందుతారు.

4. **నిశ్చయతగల**. ఒక సమూహమును ఎలా నడిపించాలో వారు నేర్చుకోగలరు అను నమ్మకము బోధకులకు ఉండాలి. వారి నమ్మకమును కట్టు కొంత పర్యవేక్షణలో ఉన్న అభ్యాసము వారికి అవసరము.

5. **వివాదమును పరిష్కరించు సామర్థ్యతగల**. ప్రజలు అసమ్మతి తెలుపునప్పుడు మరియు సమస్యలను కలిగించునప్పుడు బోధకులు సరియైన వైఖరిని కలిగియుండాలి. ఇతరుల మధ్య వివాదములను పరిష్కరించుటలో సహాయముచేయు సామర్థ్యతను వారి కలిగియుండాలి.

6. **బోధించు సామర్థ్యతగల**. బోధకుల వివరణలను ప్రజలు అర్థము చేసుకుంటారా? బోధకుడు ప్రజలను సందేహములో పడవేయువానిగా ఉండకూడదు.

7. **దేవుని వాక్యము కొరకు ఆకలి**. బోధకులు దేవుని వాక్యమును ఆస్వాదించు ప్రజలుగా ఉండాలి, తద్వారా దానిని ఆస్వాదించుటకు వారు ఇతరులను కూడా ఆహ్వానించగలరు. దేవునితో వారి వ్యక్తిగత సంబంధములలో వారు బైబిలును ప్రాముఖ్యమైనదిగా చేయాలి.

8. **దేవుని మీద ఆధారపడుట**. ఆత్మీయ ఫలితములు కేవలం పరిశుద్ధాత్మ కార్యము ద్వారా సాధ్యమవుతుందని బోధకులు గ్రహించాలి. పరిశుద్ధాత్మతో సమ్మతించుటకు వారు సిద్ధముగా ఉండాలి. వారు దేవుని అభిషేకము మీద ఆధారపడాలి. వారి సామర్థ్యతల ద్వారా మాత్రమే వారి వివరణలు సఫలమవుతాయను అతి నమ్మకమును వారు కలిగియుండకూడదు.

9. **సేవించుటకు సిద్ధముగా ఉండుట**. బోధకులు సేవను పొందుకొను ఆశగలవారిగా ఉండకూడదు. వారి తలాంతులను ఇతరులకు చూపుకొనుటకు మాధ్యమంగా వారు పరిచర్యను చూడకూడదు. వారు అవసరతలను గ్రహించి, వాలంటీర్ గా ఉండుటకు సిద్ధముగా ఉండాలి.

10. **ఆత్మీయ నాయకత్వము క్రింద ఉండుట**. బోధకులు ఇతర వ్యక్తులకు ఆత్మీయముగా జవాబుదారులుగా ఉండాలి. వారు ఆత్మీయ నాయకుల యొక్క మార్గదర్శమును అనుసరించాలి.

11. **సంఘమునకు నమ్మకముగా ఉండుట**. బోధకులు స్థానిక సంఘములలో సమర్పణగల సభ్యులుగా ఉండాలి. వారి బోధ ప్రజలు సంఘమును మెచ్చుకొనునట్లు మరియు దాని పట్ల ఎక్కువ సమర్పణ కలిగియుండునట్లుగా చేయాలి.

12. **సాఫల్యతపొందాలనే ఆసక్తి.** బోధకులకు సఫలము కావాలనే ఆసక్తి ఉండాలి, వారు త్వరగా ఓటమిని అంగీకరించకూడదు. వారు పరిస్థితులను అలవాటు చేసుకోవాలి. సమస్యలు లేక అవకాశములు ఉన్నప్పుడు వారు ముందుకు వస్తారు. వారికి శక్తి మరియు ఉత్సాహము ఉంటాయి.

13. **సిద్ధాంతపరముగా ఖచ్చితముగా.** ప్రతి బోధకునికి మంచి బైబిలానుసారమైన, ఇవాంజెలికల్ సిద్ధాంత పునాది ఉండాలి.

14. **పరిచర్యలో అనుభవము.** బోధకులు కొంతకాలము పాటు సంఘ పరిచర్యలో నమ్మకత్వము చూపినవారిగా ఉండాలి.

## అధ్యాయము 4

# మన విద్యార్థులను అర్థము చేసుకొనుట

### మతపరమైన అర్హతలు

SGC కార్యక్రమము యొక్క ఉద్దేశ్యము పరిచర్య తర్ఫీదు కాబట్టి, విద్యార్థి మంచి సాక్ష్యము మరియు దేవుని-గౌరవించు జీవనశైలిగల క్రైస్తవ విశ్వాసిగా ఉండాలి. ఒక అవిశ్వాసి కోర్సులోని విషయములను సరిగా అర్థము చేసుకోలేడు లేక మెచ్చుకోలేడు.

విద్యార్థి ఇవాంజెలికల్ సిద్ధాంతముతో సహా క్రైస్తవ విశ్వాసము యొక్క చారిత్రిక ప్రాముఖ్యతలను నమ్మాలి. ప్రతిచోట క్రీస్తు శరీరమును సేవించుటకు ఈ కార్యక్రమము రూపొందించబడింది, కాబట్టి విశేషమైన డినామినేషన్ నమ్మకముల యొక్క అవసరతలేదు.

విద్యార్థి ఆరాధనలో మరియు అతని లేక ఆమె సంఘ సహవాసములో పాలుపంచుకొను సంఘ సభ్యునిగా ఉండాలి. సంఘములలో చేరుటకు ఇష్టపడని విద్యార్థులు పరిచర్య తర్ఫీదుకు సరిపోరు. ఆదర్శవంతముగా, వారు నేర్చుకొనుచున్న విషయములను ఆచరణలో పెట్టుటకు అనుమతినిచ్చు సంఘములో సభ్యులుగా ఉండాలి.

### అవసరమైన అధ్యయన స్థాయి

సరియైన రీతిలో వ్రాయగల మరియు చదవగల విద్యార్థులను సేవించు విధముగా స్థానిక ఇన్స్టిట్యూట్ రూపొందించబడాలి. వారు స్కూల్ గ్రాడ్యుయేట్లు అయ్యుండవలసిన అవసరంలేదు, కాని కోర్సులను అర్థము చేసుకొనుటకు మరియు అభ్యాసములను పూర్తిచేయుటకు వారికి చదువుట మరియు వ్రాయుట వచ్చియుండాలి. ఈ స్థాయిలో చదువు సామర్థ్యతగల విద్యార్థులకు ఇన్స్టిట్యూట్ సర్టిఫికేట్ ను ఇవ్వాలి.

నేర్చుకోవాలని ఆశ కలిగి అభ్యాసములు చేయలేని విద్యార్థులకు ఇతర స్థాయిలో బోధనలను అందించవచ్చు. ఉదాహరణకు, చదువుట సరిగా రానివారు మరియు అభ్యాసములు చేయలేనివారికి బోధకులు సాధారణ సంఘ కూడికలలో లేక గృహ బైబిలు అధ్యయన సమూహములలో బోధించవచ్చు.

### మన విద్యార్థులను అర్థము చేసుకొనుట

స్థానిక SGC ఇన్స్టిట్యూట్లలో చేరు విద్యార్థులు ఇతర రకముల ఇన్స్టిట్యూట్లలోని విద్యార్థుల కంటే భిన్నమైనవారు. వారు విద్యాలయంలో పిల్లల వంటివారు కారు. వారు విశ్వవిద్యాలయ విద్యార్థుల కంటే మరియు బైబిలు కళాశాలలో ఉన్న అనేకమంది విద్యార్థుల కంటే భిన్నమైనవారు. ఇట్టి తరగతి కొరకు బోధకులు తన శైలులను అలవరచుకోవాలి. కొందరు విద్యార్థుల యొక్క అధ్యయన సామర్థ్యతలు ఒక కాలేజీ విద్యార్థి యొక్క సామర్థ్యత కంటే తక్కువగా ఉండవచ్చు. బోధకులు వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలి. అభ్యాసములను ఎలా చేయాలో వారు విద్యార్థులకు వివరించాలి. వారు

సోమరితనమును మరియు నిర్లక్ష్యమును మందలించాలిగాని, వారు విద్యార్థుల యొక్క అభ్యాసములను విమర్శించుట అమర్యాదగా ఉండక, సహాయకరముగా మరియు ప్రోత్సాహకరముగా ఉండాలి.



గుర్తుంచుకోండి, దేవుడు వ్యక్తులను పరిచర్య కొరకు పిలచియుంటే, వారికి కావలసిన సామర్థ్యతలను కూడా ఆయన వారికి ఇచ్చుచున్నాడు. విద్యార్థులు ఇప్పటికే తమ పరిచర్యలలో అభిషేకమును మరియు దేవుని ఆశీర్వాదమును కనుపరచుచుండవచ్చు. వారు అభివృద్ధి చెందుటలో సహాయము చేయుట మన బాధ్యత అయ్యున్నది. వారిని నిరుత్సాహపరచుట సరికాదు.

SGC విద్యార్థుల సమూహములలో పలు వయస్సులవారు ఉండవచ్చు. కొందరు అప్పుడే చదువును ముగించుకున్నవారు కావచ్చు. కొందరు అనేక సంవత్సరముల పాటు కాపరులుగా ఉన్నవారు కావచ్చు. కొన్నిసార్లు విద్యార్థి బోధకుని కంటే వయస్సులో పెద్దవాడు కావచ్చు.

ఇరవై సంవత్సరముల వయస్సు కలిగి ఇప్పుడే తన చదువును పూర్తి చేసుకున్న విద్యార్థికి అరవై సంవత్సరముల కాపరి కంటే ఎక్కువ అధ్యయన సామర్థ్యత ఉండవచ్చు. అయితే, ప్రతి ఒక్కరికి గౌరవమును చూపాలి. పరిపక్వత మరియు అనుభవమునకు అమర్యాద చూపు అధ్యయన సామర్థ్యతను మనము గౌరవించకూడదు. అధ్యయన అవసరతలను మనము ఉద్ఘాటించుచున్నప్పటికీ, అట్టి పనిలో అనుభవములేని విద్యార్థులకు అవమానము కలిగించకుండా మనము జాగ్రత్తపడాలి.

## వయోజన విద్యార్థుల యొక్క లక్షణములు

వయోజన విద్యార్థి అను పదము వయోజన జీవితమును ఆరంభించిన విద్యార్థిని వర్ణించుటకు ఉపయోగించబడుతుంది. వయోజన విద్యార్థులు వివాహితులై, పిల్లలను కలిగియుండవచ్చు. వారు ఏదైనా వృత్తి లేక పరిచర్యను చేయువారు కావచ్చు. వారికి పలు విధముల జీవిత అనుభవాలు ఉండవచ్చు. వయోజనులు మరొకసారి విద్యార్థులగుటకు నిర్ణయించుకున్నప్పుడు, వారు కొన్ని వ్యక్తిగత లక్ష్యములకు సమర్పించుకొనుచున్నారు.

బోధకుడు మరియు తరగతి యొక్క శైలి వయోజన విద్యార్థుల యొక్క అవసరతలను తీర్చు విధముగా రూపొందించబడాలి.

1. **వయోజన విద్యార్థులకు వెంటనే సహాయము చేయగల తర్ఫీదు అవసరమైయున్నది.** వారు నేర్చుకొనుచున్నదానిని ఎలా ఆచరణలో పెడతారో వారు చర్చించవలసియున్నది. వారు జ్ఞానమును ఏ విధముగా అనువర్తించాలని ఆశించుచున్నారో విద్యార్థులు వర్ణించుటకు తరగతి సమయమివ్వాలి. విద్యార్థులతో సంభాషించకుండా కేవలం మెటీరియల్ ను అందించుట కొరకు మాత్రమే బోధకుడు తరగతి సమయమంతటిని వెచ్చించకూడదు.

2. **వయోజన విద్యార్థులకు గౌరవము అవసరమైయున్నది.** వారికి ఇప్పటికే వయోజన బాధ్యతలు ఉన్నాయి మరియు వారు పిల్లల వలె వ్యవహరించబడుటను ఇష్టపడరు. బోధకులు నేర్చుకొనువారి వైఖరిని కలిగియుండి, వారిచ్చు ఆలోచనలను స్వీకరించాలి. వారి విద్యార్థుల యొక్క అనుభవము మరియు మెళకువలకు వారు గౌరవమును చూపాలి.

3. **వయోజన విద్యార్థులు నేర్చుకొనుచుండగా కొన్ని ఎంపికలు చేయగోరతారు**. వారి అనుభవాలు మరియు లక్ష్యములు కొన్ని రకముల అధ్యయనమును వారికి ఆకర్షణీయముగాను, ఔచిత్యముగాను చేస్తాయి. వారి ఆసక్తులను

అనుసరించుటకు మరియు వారి సొంత అధ్యయన శైలులను అభివృద్ధిచేసుకొనుటకు వారికి స్వాతంత్ర్యము అవసరము.

4. **వయోజన విద్యార్థులు తరగతిలో అభ్యసించగోరతారు.** విద్యార్థులు ప్రెసెంటేషన్లు చేయుటకు, మెటీరియల్ లోని కొన్ని భాగములను వివరించుటకు, మరియు ప్రశ్నలకు జవాబులిచ్చుటలో సహాయము చేయుటకు బోధకులు అనుమతించాలి. బోధకులు కాలయాపన చేయుటను నివారించవలసియున్నప్పటికీ, ఒక కథ అతడు లేక ఆమె నేర్చుకున్న విషయములను అనువర్తించుకొనుటకు విద్యార్థి ఉపయోగించు ఒక మార్గమైయున్నదని వారు గుర్తించాలి.

5. **వయోజన విద్యార్థులు ఇతర విద్యార్థులతో సంబంధములను అభివృద్ధిచేసుకుంటారు.** వారు ఒకరికొకరు ఇచ్చుకొను ఫీడ్ బ్యాక్ నుండి నేర్చుకుంటారు. వారు మర్యాదను ఇస్తారు మరియు తీసుకుంటారు. వయోజన విద్యార్థులు కొన్ని సంభాషణలను వారి మిగిలిన జీవితములన్నిటిలో జ్ఞాపకము చేసుకుంటారు మరియు విలువనిస్తారు. తరగతిని కొన్ని సమయాలలో సంభాషణ కొరకు చిన్న చిన్న సమూహములుగా విభజించుట అవసరము.

6. **వయోజన విద్యార్థులు వారి సొంత అభిప్రాయములను కలిగియుండుటకు ప్రయత్నిస్తారు.** కొన్ని రకముల అభిప్రాయములను సహించాలని వారు కోరుకుంటారు.

7. **వయోజన విద్యార్థులు బోధకుని ఇష్టపడాలని మరియు గౌరవించాలని కోరతారు.** వారికి మరియు బోధకునికి మధ్య ఉన్న స్థాయి దూరము విశ్వవిద్యాలయములో ఒక విద్యార్థి మరియు బోధకుని మధ్య ఉన్న దూరము అంత గొప్పదిగా ఉండాలని వారు ఆశపడరు. బోధకుని నుండి వ్యక్తిగత ఆసక్తిని వారు కోరతారు. వారు బోధకుని జ్ఞానమును మాత్రమేగాక, అతని సమర్పణగల జీవితమును మరియు ప్రవర్తనను కూడా మెచ్చుకోవాలని కోరతారు.

## విద్యార్థుల కొరకు ఫీడ్ బ్యాక్

మంచి అధ్యయన అలవాట్లను గూర్చి మాట్లాడుట కొరకు తరగతిలో మరియు వ్యక్తిగత విద్యార్థులతో బోధకుడు సమయమును కేటాయించాలి. తమను తాము క్రమశిక్షణలో పెట్టుకొను విధానమును మరియు అనుదిన అధ్యయన సమయమును షెడ్యూల్ చేసుకొను విధానమును విద్యార్థులు నేర్చుకోవాలి.

అభ్యాసములు మరియు హాజరును గూర్చి బోధకుడు సరియైన రికార్డులను అనుసరించాలి. కోర్సు యొక్క ముగింపులో, ఆ రికార్డు ఆధారముగానే గ్రేడులు ఇవ్వబడతాయి. కోర్సు సమయములో, వ్యక్తిగత విద్యార్థులు సరిగా చదవనప్పుడు, బోధకుడు వారితో మాట్లాడి, వారు ఎలా అభివృద్ధిచెందాలో నేర్పాలి.

అభ్యాసమును ఎలా చేయాలో అర్థము చేసుకొనుటలో విద్యార్థికి సహాయము చేయుట బోధకుని యొక్క ప్రాముఖ్యమైన పని అయ్యున్నది. సరిగా చేయని అభ్యాసములను సరిచేయుటకు విద్యార్థులకు తిరిగిఇవ్వాలి, కాని ఆ అభ్యాసమును ఎలా మెరుగుపరచాలో విద్యార్థి అర్థము చేసుకొనునట్లు బోధకుడు చూచుకోవాలి.

విద్యార్థి యొక్క హాజరు లేక అభ్యాసములు వారి గ్రేడులను తగ్గించుచున్నట్లయితే, అభివృద్ధి చెందవలసిన అవసరతను గూర్చి బోధకుడు వారితో మాట్లాడాలి. కోర్సు యొక్క ముగింపులో వారు పొందు గ్రేడుల ద్వారా విద్యార్థులు ఆశ్చర్యపడకూడదు.

### అధ్యాయము 5

# మంచి బోధనా పద్ధతులు

## తరగతి యొక్క శైలిని నియమించుట

తర్ఫీదు కార్యక్రమము యొక్క ఆరంభములో, ఉత్సాహం మరియు ఆకాంక్ష ఉంటాయి. ఏమి ఆశించాలో విద్యార్థులకు ఖచ్చితముగా తెలియదుగాని, సమూహము నుండి సహాయమును పొందాలని వారు నిరీక్షిస్తారు.

తరగతి యొక్క మొదటి కూడిక తదుపరి కూడికల కంటే భిన్నముగా ఉండవచ్చు ఎందుకంటే తరగతిని గూర్చి పరిచయములు మరియు వివరణలు అవసరమైయున్నవి. అయితే, మొదటి కూడిక భవిష్యత్ కూడికల కొరకు శైలిని నియమిస్తుంది. ఉదాహరణకు, ఎవరైనా మొదటి కూడికలో మాట్లాడాలని ఇష్టపడకపోతే, భవిష్యత్తులో కూడా ఆ వ్యక్తి మౌనముగా ఉండాలని ఆశించుట జరుగుతుంది. ఒక వ్యక్తి సంభాషణలో ఎక్కువ మాట్లాడిన యెడల, భవిష్యత్ సంభాషణలలో కూడా అదే వ్యక్తి ఎక్కువ మాట్లాడాలని సమూహము ఆశించవచ్చు. కూడిక క్రమము లేకుండా ఉంటే, భవిష్యత్తులో కూడా వారు ఇదే ఆశిస్తారు. తరగతిలో విద్యార్థులు చాలా తక్కువగా పాలుపంచుకొనుచుంటే, వారు భవిష్యత్తులో కూడా ఇదే పద్ధతిని ఆశిస్తారు.

తరగతి వారు ఆశించిన విధముగా లేకపోవుట వలన కొందరు విద్యార్థులు కొన్ని కూడికల తరువాత మానివేసే అవకాశం ఉంది. ప్రతిఒక్కరిని సంతోషపరచు విధముగా తరగతిని రూపొందించుట సాధ్యము కాదు, కాని నేర్చుకోవాలని కోరు విద్యార్థులను సంతృప్తిపరచుటకు దానిని రూపొందించవలసియున్నది. సరియైన విషయములను ఆశించు విద్యార్థులు నిరుత్సాహపడకుండా తరగతిని సరియైన రీతిలో నడిపించుట ప్రాముఖ్యమైయున్నది.

## ఫలితముల కొరకు ఆశించుట

మన తర్ఫీదు యొక్క అత్యుత్తమమైన ఫలితములు ప్రభావవంతమైన పరిచర్యలు మరియు స్థిరమైన క్రైస్తవ జీవితములు అయ్యుండాలి. ప్రభావవంతమైన కాపరులు, బోధకులు, సువార్తికులు, మరియు మిషనరీలు ఈ కార్యక్రమము నుండి మేము ఆశించు ఫలితములైయున్నారు.

వారి తరగతులు ప్రభావవంతముగా ఉన్నాయో లేవో తెలుసుకొనుటకుగాను బోధకులు త్వరిత, గమనించదగిన ఫలితముల కొరకు అన్వేషించాలి. వారి విద్యార్థులు పరిచర్య బాగుగా చేస్తారో లేదో చూచుటకు ఎదురుచూడకుండా వారి తరగతులు ప్రభావవంతముగా ఉన్నాయో లేవో వారు తెలుసుకోవాలి.

తరగతి నుండి మంచి ఆసక్తిని పొందుట ఒక బోధకుడు పొందదగిన మొదటి ఫలితమైయున్నది. విద్యార్థులు ఆసక్తిని పెట్టుటకుగాను బోధకులు క్రమమును కలిగియుండాలి. విద్యార్థుల యొక్క ఆసక్తి సరిగా లేనప్పుడు బోధకులు కేవలం వారిని మాత్రమే నిందించకూడదు. బోధకులు తరగతిని ఆసక్తికరముగా చేయాలి.

తరగతి సఫలమగుచున్నది అనుటకు ఇతర గురుతులు కూడా ఉన్నాయి. విద్యార్థులు సంభాషణలో పాలుపంచుకొనుట, విద్యార్థులు మంచి ప్రశ్నలను అడుగుట, మంచి హాజరు, అభ్యాసములను పూర్తి చేయుట, వారు నేర్చుకున్న విషయములను గూర్చి విద్యార్థులు ఉత్సాహమును చూపుట ఈ చిహ్నములలో కొన్ని భాగములైయున్నవి. బోధకులు ఈ చిహ్నములను చూడని పక్షమున, వారి తరగతుల శైలిని అభివృద్ధిచేసుకొను విధానములను వారు కనుగొనాలి.

## మంచి బోధన కొరకు అదనపు మార్గనిర్దేశములు



1. **సమయమునకు విలువనివ్వండి.** కూడికలను సమయానికి ఆరంభించండి మరియు ముగించండి. అందరు వచ్చే వరకు వేచియుండవద్దు. మీరు ఆసల్యముగా ఆరంభిస్తే, సమయానికి వచ్చిన ప్రజల యొక్క సమయమును మీరు వృధా చేయుచున్నారు. మీరు ఆలస్యముగా ముగించినప్పుడు, విద్యార్థుల యొక్క ఇతర బాధ్యతలను నెరవేర్చకుండా ఆటంకమును కలిగించుచున్నారు. కొన్ని సంస్కృతులలో, సమయమును పాటించుట అంత సులభము కాదు, కాని ఉద్యోగ విషయములో లేక ప్రయాణములో సమయమును ఎలా పాటించాలో ఆ సంస్కృతులలోని ప్రజలకు తెలుసు. వారు తరగతికి కూడా అదే ప్రాముఖ్యతను ఇవ్వాలి.

2. **విద్యార్థులను అర్థ చంద్రాకారములో కూర్చోపెట్టండి.** సంభాషణ ప్రాముఖ్యము కాబట్టి, విద్యార్థులు ఒకరినొకరు చూచుకొను విధముగా విద్యార్థులను కూర్చోబెట్టండి.

3. **విద్యార్థులు మాట్లడునప్పుడు జాగ్రత్తగా వినండి.** మంచిగా వినుటకు గురుతులు ఏవనగా, కన్నులు కలుపుట, ధ్యాసపెట్టు ముఖ వ్యక్తీకరణ, అంతరాయములను నిర్లక్ష్యం చేయుట, బోధకుని యొక్క హాస్యం మరియు ఇతర భావనలకు స్పందించుట.

4. **ఏ విద్యార్థి కూడా ఎల్లప్పుడూ మౌనముగా ఉండకుండా చూచుకొనుడి.** ఎక్కువగా మాట్లాడని ఒక విద్యార్థిని ఒక ప్రశ్న అడగండి ("చార్లెస్, దీనిని గూర్చి నీ అభిప్రాయం ఏమిటి?").

5. **వారిలో నమ్మకమును కట్టుటకు విద్యార్థులు జవాబు ఇవ్వగల ప్రశ్నలను అడగండి.** ఎవరైనా తప్పు సమాధానము చెబితే, దానిని విమర్శించుటకు ముందు ఆ జవాబులో ఉన్న మంచిని ఉద్ఘాటించండి.

6. **విమర్శించుటకు ముందు ప్రతి వ్యాఖ్యను ఉద్ఘాటించుటకు ప్రయత్నించండి.** వారి పాలుపంపులను ఉద్ఘాటించిన యెడల విద్యార్థుల నమ్మకం పెరుగుతుంది.

7. **ఒకే విద్యార్థి ఎక్కువగా మాట్లాడుటకు మరియు ప్రశ్నలన్నిటికి జవాబిచ్చుటకు అనుమతి ఇవ్వవద్దు.** మీరు కొందరు విద్యార్థులను ప్రశ్నలు అడగవచ్చు. లేక మీరు ఇలా అడగవచ్చు, "మీలో మిగిలినవారు ఏమి ఆలోచించుచున్నారు?" ఒక సంభాషణలో మీరు ఇలా అనవచ్చు, "ఇప్పటి వరకు దీనిని గూర్చి మాట్లాడని వ్యక్తి నుండి విందాము."

   ఒకవేళ కొందరు ఇంకా ఎక్కువగా మాట్లాడుతుంటే, కూడిక వెలుపల నాయకులు వారితో వ్యక్తిగతంగా మాట్లాడవచ్చు. నాయకుడు ఇలా చెప్పవచ్చు: "చార్లెస్, నీవు చాలా త్వరగా ఆలోచిస్తావు మరియు సంభాషణలలో త్వరగా స్పందిస్తావు, కాని నీవు అంత త్వరగా జవాబులు

ఇస్తుంటే ఇతరులు పాలుపంచుకొనుట కష్టమవుతుంది అని నేను భావిస్తున్నాను. అందరు పాలుపంచుకొనుటలో నీవు నాకు సహాయము చేయగలవా?"

8. **సమూహమును నిర్లక్ష్యము చేయుచు ఇద్దరు ముగ్గురు విద్యార్థులు వాదించుకొనుటకు అవకాశం ఇవ్వవద్దు.** ఒక విషయమును గూర్చి ఎవరైనా ఎక్కువ సేపు వాదించాలని కోరితే, ఆ సంభాషణను తరువాత ముగించమని ఆ వ్యక్తికి తెలపండి.

9. **ఇతరులకు అంతరాయం కలిగించుటకు ఏ ఒక్కరికీ అనుమతి ఇవ్వవద్దు.** మీ చేతిని పైకెత్తండి, అంతరాయము కలిగించువారిని ఆపండి, మొదటిగా మాట్లాడుతున్న వ్యక్తికి పూర్తి చేయుటకు అనుమతి ఇవ్వండి. లేకపోతే, సంభాషణలో ఎల్లప్పుడూ సరియైన పద్ధతిలేని సభ్యులు ఆధిపత్యం చెలాయిస్తుంటారు. తక్కువ నిశ్చయతతో మాట్లాడు ప్రజలకు వారి మాటలు పూర్తి చేసే అవకాశం లభించదు కాబట్టి, వారు విసుగుచెందుతారు.

10. **ఫిర్యాదులను వినండి.** ప్రతి ఫిర్యాదులో పరిష్కరించవలసిన ఒక సమస్య ఉంటుంది. అసంతృప్తి యొక్క గురుతులను నిర్లక్ష్యం చేయవద్దు. తరగతి విషయములో ఎవరైనా అసంతృప్తి చెందితే, అతడు లేక ఆమె ఉద్దేశ్యమును అర్థము చేసుకోలేరు, లేక సరియైన ఫిర్యాదును కలిగియుండగలరు.

11. **అంతరాయములు కలిగించు విద్యార్థిని సరిచేయండి.** ఎవరైనా విద్యార్థులు తరచుగా ఆటంకములు కలిగిస్తూ, వాదిస్తూ, విసుగు కలిగిస్తుంటే, వారు తరగతి యొక్క ఉద్దేశ్యమును అర్థము చేసుకోలేరు. తరగతి వారు ఊహించిన విధముగా ఉండకపోవచ్చు. తరగతి యొక్క ఉద్దేశ్యమును చూచుటలో వారికి సహాయము చేయుటకు వ్యక్తిగతముగా వారితో మాట్లాడండి.

12. **మీకు జవాబు తెలియని యెడల మీరు జవాబు తెలుసు అన్నట్లు నటించవద్దు.** ఒక బోధకుడు అన్ని తెలుసుకొని ఉండవలసిన అవసరత లేదు. మీరు జవాబును తెలుసుకొనుటకు ప్రయత్నిస్తారని విద్యార్థులకు చెప్పవచ్చు.

13. **సంభాషణలు హానికరముగా మారుటకు అనుమతి ఇవ్వవద్దు.** స్థానిక సంఘమును మరియు నాయకులను విమర్శించుటకు ఒక మాధ్యమంగా ఉండునట్లు సమూహమును అనుమతించవద్దు. వారి సంఘ సభ్యులు తరగతిలో చేరినప్పుడు చాలామంది కాపరులు చింతిస్తారు.

14. **మీ విద్యార్థులను తెలుసుకోండి.** వారి కుటుంబ పరిస్థితి, పరిచర్య అనుభవం, అధ్యయన నేపథ్యం, ప్రస్తుత పరిచర్య స్థానము, మరియు భవిష్యత్తు కొరకు లక్ష్యములు మీకు తెలిసియుంటే వారికి మీరు మరింత ప్రభావవంతముగా బోధించగలరు. వ్యక్తిగత సంభాషణలలో వీటిని నేర్చుకొనుటకు ప్రయత్నించండి.

మంచి బోధన కొరకు ఇతర మార్గదర్శకములు మరియు వయోజన విద్యార్థుల యొక్క ఇతర గుణములు 6వ అధ్యాయములో ఇవ్వబడినవి.

## అధ్యాయము 6

# SGC కోర్సులను ఎలా బోధించాలి

### తరగతిగది

వీలైతే బోధకుడు తరగతి గదిని ముందుగానే సిద్ధపరచాలి. విద్యార్థులు ఒకరినొకరు చూచుకొను విధముగా వారిని కూర్చోబెట్టాలి. ఆ స్థలములో తరగతి సమయములో ఆటంకములు కలిగించు క్రియాకలాపాలు మరియు శబ్దములు లేకుండా బోధకుడు చూచుకోవాలి. సౌకర్యవంతమైన కుర్చీలు, సౌకర్యవంతమైన వాతావరణం, మరియు మంచి వెలుగు ఉండునట్లు బోధకుడు చూడాలి. ఎక్కువ అంతరాయములు లేని యెడల ఆరుబయట అధ్యయనమును చేయుట కూడా మంచిదే.

వ్రాయుటకు మరియు గీయుటకు తరగతిగదిలో పెద్ద బోర్డు ఉండాలి.

### మొదటి తరగతి దినము

బోధకులు తమను తాము పరిచయం చేసుకోవాలి, వారి కుటుంబములను గూర్చి, పరిచర్య అనుభవములు, ప్రస్తుత పరిచర్యలు, మరియు అధ్యయన నేపథ్యములను గూర్చి పంచుకోవాలి. ఉన్నతమైన స్థితిని చూపుకొనుటకు ప్రయత్నించునట్లు వారి సాధింపులను లెక్కబెట్టకుండా జాగ్రత్తపడాలి. ఈ సమాచారమును పంచుకొనుట వెనుక ఉన్న ఉద్దేశ్యము విద్యార్థులతో సంబంధమును కట్టుట అని వారు గుర్తుంచుకోవాలి.

విద్యార్థులు తమను తాము క్లుప్తంగా పరిచయం చేసుకోవాలి. బోధకుడు ఆసక్తి చూపుటకు మరియు వారి మధ్య సంబంధమును పెంపొందించుటకు ఒకటి రెండు ప్రశ్నలను అడుగుట ద్వారా ప్రతి ఒక్కరితో క్లుప్తంగా సంభాషించవచ్చు.

పరిచయముల తరువాత ప్రార్థన కొరకు సమయమును కేటాయించవచ్చు. విద్యార్థుల యొక్క అవసరతలను తీర్చుటకు దేవుడు తరగతిని ఉపయోగించుకోవాలని ప్రార్థించండి. బోధనను జీవితమును మార్చునదిగా మరియు ఉపయోగకరముగా చేయుటకు బోధకుడు దేవుని మీద ఆధారపడుతున్నట్లు చూపాలి. భవిష్యత్ తరగతి సెషన్లు ప్రార్థనలో ఆరంభము కావాలి మరియు ప్రార్థనా అవసరతలను క్లుప్తంగా పంచుకొనవచ్చు.

బైబిళ్ళు, ప్రింటెడ్ కోర్సులు, మరియు వ్రాయు వస్తువులతో సహా ఏ వస్తువులను తీసుకొనిరావాలో బోధకులు విద్యార్థులకు చెప్పాలి. పరీక్షించు ఉద్దేశ్యముల కొరకుగాక, తమ సొంత భవిష్యత్ ప్రయోజనము కొరకు విద్యార్థులు నోట్స్ తీసుకోవాలని బోధకులు ఉద్ఘాటించాలి. (పరీక్షా వనరులు అన్నీ కోర్సు టెక్స్ట లో ఉన్నాయి.)

పరిచయముల తరువాత, మొదటి దినమున తరగతి సమయము భవిష్యత్తులో తరగతి అనుసరించు శైలికి అనుగుణంగా ఉండాలి, తద్వారా ఏమి ఆశించాలో విద్యార్థులకు తెలుస్తుంది.

## పాఠం రూపరచన

SGC కోర్సులు కేవలం పుస్తకములు మాత్రమే కావు; అవి బోధన కొరకు రూపించబడిన కోర్సులైయున్నవి. ప్రతి కోర్సు యొక్క ఆరంభములోను బోధకుని కొరకు కొన్ని నిర్దేశనములు ఉన్నాయి. కోర్సులు ఒకదానిని ఒకటి పోలియుంటాయిగాని రూపరచనలో మాత్రమే ఒకే విధముగా ఉండవు.



కొన్ని కోర్సుల యొక్క పాఠములు పాఠ్య ఉద్దేశ్యములతో ఆరంభమవుతాయి. బోధకుడు వాటిని తరగతిలో చదవనవసరములేదు.

అనేక పాఠములు ఒక ప్రశ్న లేక కథ లేక ఏదో ఒక ఇతర ఆసక్తిని ఆకర్షించు విధానమును మరియు ఆ అంశము ప్రాముఖ్యమైనది అని విద్యార్థి భావించునట్లుచేయు విధానమును కలిగియుంటాయి.

బోధకులు పేరాలను వివరిస్తూ పాఠములోని ఒక్కొక్క పేజీని బోధించవచ్చు. వారు విషయములను అర్థము చేసుకొనుట కొరకు ముందుగానే సిద్ధపడి, ప్రతి పేరాను వివరించుటలో సహాయపడు ముఖ్యమైన పదములను అండర్లైన్ చేయవలెను.

చర్చా ప్రశ్నలు బోధనా భాగము అంతటిలో ఉంటాయి. కొన్నిసార్లు ఒక ప్రశ్న రాబోవు విషయములను పరిచయం చేస్తుంది. ఇతర సమయాలలో, ఒక ప్రశ్న విద్యార్థులు అంతకు ముందే చదివిన ఒక విషయమునకు స్పందించమని కోరుతుంది. ప్రశ్నలు "అవును" లేక "కాదు" అను జవాబులను ఆశించవు. అనేకమంది విద్యార్థులు స్పందించుటకు బోధకుడు అవకాశం ఇవ్వాలి. ప్రతిసారి సంభాషణ ఒక నిశ్చితమైన పరిష్కారమునకు రావలసిన అవసరతలేదు, ముఖ్యముగా ఒక ప్రశ్న రాబోవు విషయములను పరిచయం చేయుచున్నప్పుడు.

బోధకులు తమ సొంత అదనపు సంభాషణ ప్రశ్నలను చేర్చవలసియున్నది. విద్యార్థులతో ఏ విధమైన సంభాషణ లేకుండా అనేక నిమిషములపాటు తామే మాట్లాడుచున్నామని బోధకులు గమనించిన ప్రతిసారి, వారు విద్యార్థులను ఒక ప్రశ్న అడగాలి.

సంభాషణలు సమయమును వృథా చేయకుండా చూచుకొనుట కష్టమైన పనే. అయితే, సంభాషణ లేకుండా చాలామంది సరిగా చదవలేరు. అంశములు వారి సంస్కృతులు మరియు సంఘ పరిస్థితులకు ఏ విధముగా అనువర్తించబడతాయో ఆలోచించుటకు మరియు ఇతరులు మాట్లాడుచుండగా వినుటకు విద్యార్థులకు సమయము కావాలి.

ఎక్కువ పాఠములు అభ్యాసములతో ముగుస్తాయి. బోధకుడు అభ్యాసమును వివరించాలి. తరగతి దినమున అనేక పాఠములు ఉంటే, తరువాత తరగతిలో అప్పగించవలసిన అభ్యాసములను విద్యార్థులు అర్థము చేసుకొనునట్లు బోధకుడు చూచుకోవాలి.

## తరువాత తరగతి దినములు

మొదటి దినము తరువాత ప్రతి తరగతి దినమున అభ్యాసములు అప్పగించవలసియుంటుంది. తరగతి యొక్క ఆరంభములో బోధకుడు అభ్యాసములను సేకరించాలి. కొన్ని విద్యార్థుల ప్రెసెంటేషన్లను ఆరంభములో చేయవచ్చు, మరికొన్నిటిని భిన్నత్వము కొరకు రోజులో మరొక సమయములో చేయవచ్చు.

జ్ఞాపకశక్తిలో నుండి ఒక పరీక్షను వ్రాయవలసి వచ్చినప్పుడు, ఇతర విద్యార్థులు వ్రాయుచున్న దానిని చూడకుండా ఉండునట్లు విద్యార్థులను కూర్చోబెట్టుట చాలా అవసరము.

ఇవ్వబడిన విద్యార్థుల ప్రెసెంటేషన్లతో పాటు, కోర్సులోని ఒక భాగములో నుండి విషయములను ప్రెసెంట్ చేయమని బోధకుడు విద్యార్థిని తరచుగా అడగాలి. విద్యార్థి సిద్ధపడునట్లు దీనిని ముందుగానే నిర్ణయించాలి.

# అధ్యాయము 7

# బోధకులను కనుగొనుట

## ఈ అధ్యాయమును ఉపయోగించు మూడు మార్గములు

1. **స్థానిక బోధకులను అభివృద్ధి చేయుటకు తర్ఫీదుదారుడు ఈ అధ్యాయములోని పద్ధతులను ఉపయోగించవచ్చు.** స్థానిక సంఘములో బోధించు సామర్థ్యతగలవారు లేకపోతే, వెంటనే స్వతంత్రముగా నిర్వహించబడగల స్థానిక కార్యక్రమమును తర్ఫీదుదారుడు ఆరంభించలేడు. తర్ఫీదుదారుడు సామర్థ్యత ఉన్న బోధకులను కనుగొని, వారిని అభివృద్ధి చేయాలి. స్థానిక బోధకులను ఎలా తర్ఫీదుచేయాలో ఈ అధ్యాయము తెలియజేస్తుంది.

2. **వారి విద్యార్థుల కొరకు ఈ పద్ధతిని ఉపయోగించుటకు తర్ఫీదుదారుడు స్థానిక బోధకులను సిద్ధపరుస్తాడు.** క్రొత్త స్థలములోని స్థానిక బోధకులు ఇప్పటికే బోధించ సమర్థులైయుంటే, తర్ఫీదుదారుడు ఈ అధ్యాయములోని అభ్యాసములను ఉపయోగించవలసిన పనిలేదు. వారి విద్యార్థులను అభివృద్ధి చేయుట కొరకు తర్ఫీదుదారుడు పద్ధతిని స్థానిక బోధకులకు బోధించాలి.

3. **స్థానిక బోధకుడు విద్యార్థులను అభివృద్ధిచేస్తాడు.** ప్రతి బోధకుడు విద్యార్థుల యొక్క పరిచర్య నైపుణ్యతలను అభివృద్ధిచేయుటకు ప్రయత్నించాలి. విద్యార్థులు సమూహములతో మాట్లాడుట ఆరంభించుటకు ఈ అధ్యాయములో వర్ణించబడిన పద్ధతులు సహాయముచేయగలవు.

## బోధకులను కనుగొనవలసిన అవసరత

కొన్నిసార్లు SGC సిబ్బంది సంఘములను దర్శించినప్పుడు, వెంటనే కోర్సులను బోధించుటకు సిద్ధపడు ప్రజలను కనుగొంటారు. సాధారణంగా, ఈ బోధకులు కొంత అధ్యయన తర్ఫీదు మరియు బోధనా అనుభవముగలవారు. వారు కోర్సులను చూసి, అవి బోధించుటకు సులువైనవి అని గుర్తిస్తారు. ప్రతి కోర్సు యొక్క ఆరంభములో నిర్దేశనములు ఇవ్వబడినవి. సంభాషణ ప్రశ్నలు ఇవ్వబడినవి. కోర్సులు కేవలం పుస్తకములు మాత్రమే కావు; వాటిని ఉన్నవి ఉన్నట్లుగా బోధించవచ్చు.

అధ్యయన నైపుణ్యత, బైబిలు జ్ఞానము, మరియు బోధనా సామర్థ్యతగల వ్యక్తి వాటిని ఉపయోగించుటను త్వరగా నేర్చుకొనునట్లు కోర్సులు రూపొందించబడినవి. అయితే, కొన్నిసార్లు ఎక్కువ అధ్యయన తర్ఫీదులేని ప్రజలు, తమకు బోధించు సామర్థ్యతలేదని భావిస్తారు. కేవలం ఉన్నతమైన తర్ఫీదుగల వ్యక్తి మాత్రమే బోధించగలడు అని వారు భావిస్తారు.

యూనివర్సిటీలో చదువు అవకాశం దక్కని అనకేమందికి దేవుడు బోధించు సామర్థ్యతను ఇచ్చియున్నాడు. సంఘమునకు బోధకులు అవసరము కాబట్టి, సంఘము ఉనికిలో ఉన్న ప్రతిచోట దేవుడు సాధారణమైన ప్రజలకు బోధించు సామర్థ్యతను ఇచ్చియున్నాడని మనము నిశ్చయతను కలిగియుండవచ్చు (ఎఫెసీ. 4:11-12).

వారు తమ సాధారణ జీవితములలో కూడా బోధనా నైపుణ్యతను అభివృద్ధిచేసుకున్నారని అనేకమంది గ్రహించరు. వారు ఇంటి యొద్ద మరియు పని చేయు చోట్ల విషయములను వివరించగలరు. సమస్యలను పరిష్కరించుటలో వారు ప్రజలకు సహాయం చేస్తారు. విషయములను వివరించు సామర్థ్యతగలవారిగా వారు గుర్తింపుపొందుతారు. వారు విద్యార్థులుగా ఉన్న

దినములలో చదువుట, గ్రహించుట మరియు వివరించుటలో వారు ప్రవీణులు. వారికి బోధించు సామర్థ్యత ఉన్నదని వారికి తెలియదు.

మార్గదర్శకమునిచ్చు మాట్లాడు అనుభవాల ద్వారా బోధించు సామర్థ్యతగలవారు తమ సామర్థ్యతను కనుగొనుటలో తర్ఫీదుదారుడు సహాయము చేయాలి. అనుభవము ద్వారా, సమూహములతో మాట్లాడుటకు ఒక వ్యక్తి నిశ్చయతను సంపాదిస్తాడు.

## మాట్లాడు అనుభవములను సృష్టించు విధానములు

1. **సులువైన అంశముల మీద మాట్లాడు అభ్యాసములను ఇవ్వండి.** ఒక ఉపన్యాసము కేవలం కొన్ని నిమిషములు మాత్రమే ఉండాలి. మాట్లాడుటకు సమూహము ఎదుట నిలబడుటకు విద్యార్థులు భయపడుతుంటే, తమ కుర్చీలలో కూర్చొని తమ మొదటి ఉపన్యాసములను వారు ఇవ్వవచ్చు.

   సులువైన మాట్లాడు అభ్యాసములకు ఉదాహరణలు:

   - మీరు బాల్యములో ఎదుర్కొనిన ఒక కష్టమును గూర్చి మాట్లాడండి.
   - మీకు ప్రాముఖ్యమైన ఒక బంధువును గూర్చి మాట్లాడండి.
   - మరొక విద్యార్థిని కొన్ని ప్రశ్నలు అడిగి, తరువాత ఆ విద్యార్థిని సమూహమునకు పరిచయం చేయండి.
   - మీరు ఏ స్థలమును సందర్శించగోరుతున్నారు? ఎందుకు?
   - లేఖనములో మీకు నచ్చిన వచనములలో ఒకదానిని గూర్చి చెప్పండి.
   - మీరు ఉద్యోగములో అనుసరించు దినచర్యను గూర్చి చెప్పండి.
   - మీరు ఈ మధ్యనే వినిన ప్రసంగములో మీకు జ్ఞాపకమున్న విషయము ఏమిటి?

2. **తరగతిలో ఉన్న ఒక వ్యక్తిని ఒక ప్రశ్న అడగండి.** ఆ ప్రశ్నకు ఒక చిన్న జవాబు మాత్రమేగాక, కొంత వివరణ కూడా అవసరమైయుండాలి. ప్రశ్న ఆ వ్యక్తి జవాబు ఇవ్వగలిగినదిగా ఉండాలి, తద్వారా ఆ వ్యక్తి ఎక్కువ నిశ్చయత కలిగియుండి, అవమానపడవలసిన అవసరత ఉండదు.

3. **తమ వ్రాయు అభ్యాసములను సమూహమునకు వివరించమని విద్యార్థులను అడగండి.** కోర్సులకు అనేక వ్రాయు అభ్యాసములు అవసరమైయున్నవి. తర్ఫీదుదారుడు కేవలం ఒక రోజు కొరకు మాత్రమే అక్కడ ఉన్నప్పటికీ, విద్యార్థులు ఒక అభ్యాసమును వ్రాసి, దానిని ప్రెసెంట్ చేయుటకు సమయమును ఇవ్వవచ్చు.

4. **బోధనా అభ్యాసము కొరకు ముగ్గురుముగ్గురుగా సమూహములుగా విభాగించండి.** ప్రతి వ్యక్తి సమూహమునకు చిన్న భాగమును బోధించుటకు అవకాశం ఇవ్వండి. ఇది తక్కువమందికి బోధించుటకు మరియు ఒకే సమయములో పలువురు విద్యార్థులు అభ్యసించుటకు అవకాశమును ఇస్తుంది.

5. **పాఠములో నుండి ఒక భాగమును వివరించమని ఒక విద్యార్థిని కోరండి.** కోర్సులలోని అనేక భాగములలో ఒక అంశమును వివరించు కొన్ని పేరాలు మాత్రమే ఉంటాయి. ఒక భాగమును కొన్ని నిమిషాలలో వివరించుటకు సిద్ధపడియుండమని ముందుగానే ఒక విద్యార్థిని కోరండి.

6. **ఏదో ఒక కోర్సులోని ఒక పాఠంమును బోధించమని కొంచెం చురుకైన విద్యార్థిని అడగండి.** మరొక వ్యక్తి బోధించుచుండగా వినిన ఒక పాఠమును బోధించుట విద్యార్థికి సులభమవుతుంది. అతనికి ఏ ఒక్కరు బోధించని ఒక పాఠము కొరకు సిద్ధపడి, బోధించునప్పుడు విద్యార్థి ఉన్నతమైన సామర్థ్యతను కనుపరుస్తాడు. వీలైనంత వరకు తానే బోధించాలని తర్ఫీదుదారుడు తలంచవచ్చు, మరియు తరగతి తర్ఫీదుదారుని మాటలు వినాలని కోరవచ్చు, కాని బోధించుటకు ఇతరులను సిద్ధపరచుట ఇక్కడ లక్ష్యమైయున్నది.

7. **“బల్ల మీద మాట్లాడు” పద్ధతిని ఉపయోగించండి.** విద్యార్థులు ప్రింట్ చేయబడిన కోర్సు మెటీరియల్ ను తీసుకొని బల్ల చుట్టూ కూర్చుంటారు. బల్ల మీద బోధకులు ఉండరు. పాఠములోని విషయములను గూర్చి మాట్లాడుటకు పలువురు విద్యార్థులు సమయమును తీసుకుంటారు. నడిపించుటకు మరియు పలువురు విద్యార్థుల అభిప్రాయములను అడుగుతూ సంభాషణను కొనసాగించుటకు బల్ల మీద ఉన్న ఒక వ్యక్తి నియమించబడతాడు. నాయకుడు బోధకుడు కాదు. బోధకుడు లేకుండా తాము చర్చించుట ద్వారా నేర్చుకోగలము అని సమూహము కనుగొంటుంది. బోధించుటకు అర్హతగలవారు లేని చోట్ల ఈ పద్ధతి అధ్యయన సమూహములను బలపరుస్తుంది.

## ముగింపు

ప్రతి చోట పరిచర్య తర్ఫీదును స్థానికముగా చేయుట SGC యొక్క దర్శనమైయున్నది. దేవుడు సామర్థ్యత మరియు బైబిలు జ్ఞానమునిచ్చిన ప్రజల ద్వారా తర్ఫీదు ఎక్కడైనా జరగవచ్చు. వారి ఉద్దేశ్యము కేవలం జ్ఞానమునిచ్చుట మాత్రమేగాక ఇతరులకు సత్యమును వివరించుటలో విద్యార్థులను సిద్ధపరచుట కూడా అయ్యున్నది అని బోధకులు జ్ఞాపకము చేసుకోవాలి.

## అధ్యాయము 8

# స్థానిక షెఫర్డ్స్ ఇన్స్టిట్యూట్ ను నిర్వహించుట

### పరిచయం

SGC కోర్సులు పలు కార్యక్రమాలలో ఉపయోగించబడతాయి. కొన్ని హై స్కూళ్లు (వీటిని కొన్నిసార్లు మాధ్యమిక పాటశాలలు అని కూడా పిలుస్తారు) కొన్ని కోర్సులను ఉపయోగిస్తాయి. కొన్ని సంఘములు వారి సండే స్కూల్ లో ఈ కోర్సులను ఉపయోగిస్తారు. గృహ బైబిలు అధ్యయన సమూహములు అధ్యయనము చేయుటకు కోర్సులను ఎన్నుకుంటారు. ప్రసంగము మరియు బోధనలలో ఉపయోగించుటకు కాపరులు కోర్సులలోని విషయములను ఎన్నుకుంటారు.

ఈ అధ్యాయములోని నిర్దేశనములు సంపూర్ణ అధ్యయన కార్యక్రమము కొరకు 20 SGC కోర్సులను ఉపయోగించు స్థానిక ఇన్స్టిట్యూట్ ను నిర్వహించుట కొరకు అనువర్తించబడతాయి.



### అధ్యయన స్థాయి

SGC కోర్సుల యొక్క సంపూర్ణ వర్గములో బైబిలు కళాశాల పాఠ్యాంశములలోని అత్యంత ప్రాముఖ్యమైన విషయములు ఉంటాయి. కఠినమైన పదములు లేకుండా ఇది ఉద్దేశ్యపూర్వకముగా వ్రాయబడినది.

కోర్సులను అవి రూపించబడిన విధముగా అధ్యయనం చేయుటకు ఒక విద్యార్థికి చదువుట మరియు వ్రాయుట వచ్చియుండాలి.

క్రొత్తగా మారుమనస్సుపొందినవారిని శిష్యులను చేయుటకు ఈ కోర్సులు రూపొందించబడలేదు, కాని ఈ మెటీరియల్ చాలా వరకు దీని కొరకు ఉపయోగపడుతుంది.

సమూహము చేయదగిన ఉత్తమమైన పనులు ఏవనగా, ప్రతి విద్యార్థి

1. కోర్సు కాపీను కలిగియుండాలి
2. అన్ని అభ్యాసములను పూర్తి చేయాలి
3. సమూహమునకు విషయములను ప్రెసెంట్ చేయుటను అభ్యసించుటకు అవకాశం పొందాలి
4. స్థానిక సంఘముతో మంచి సంబంధం కలిగియుండాలి, మరియు
5. సమూహము వెలుపల తరచుగా పరిచర్యను చేయాలి.

ఈ ఆచారములను అనుసరించు బోధకుడు విద్యార్థులను పరిచర్య కొరకు ప్రభావవంతముగా తర్ఫీదుచేయగలడు.

పరిచర్య కొరకు సిద్ధపడని విద్యార్థుల సమూహముల కొరకు విద్యార్థి ఎడిషన్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థి ఎడిషన్లు కోర్సుల యొక్క క్లుప్త వెర్షన్లైయున్నవి. వీటిని హై స్కూళ్లు (మాధ్యమిక పాటశాలలు) మరియు సండే స్కూల్స్ లో ఉపయోగిస్తారు. ఈ విద్యార్థులు సాధారణ అభ్యాసములను చేయరు ఎందుకంటే వారు పరిచర్యను అభ్యసించుటలేదు లేక పరిచర్య కొరకు సిద్ధపడుట లేదు. విద్యార్థి ఎడిషన్లను పరిచర్య కొరకు సిద్ధపడుతున్న మరియు పరిచర్య తర్ఫీదు సర్టిఫికేట్ ను పొందగోరుతున్న విద్యార్థుల కొరకు ఉపయోగించకూడదు. ఈ విద్యార్థుల బోధకులు వాస్తవిక SGC కోర్సు విషయముల నుండి బోధించాలి ఎందుకంటే విద్యార్థి ఎడిషన్ అసంపూర్ణమైనది.

SGC ఒక అధ్యయన డిగ్రీని ఇవ్వదు. కొన్ని చోట్ల SGC కోర్సులను ఉపయోగించు స్థానిక లేక జాతీయ సంస్థలు వారి సొంత అవసరతల ఆధారముగా ఒక డిగ్రీని లేక సర్టిఫికేట్ ను ఇస్తారు. విద్యార్థి ఆ సంస్థతో రిజిస్టర్ చేసుకొని, వారు అవసరతలను పూర్తిచేయాలి.

అధ్యయన డిగ్రీ అందుబాటులోలేని చోట్ల, కార్యక్రమమును ప్రొఫెషనల్ తర్ఫీదుగా పరిగణించాలి. వ్యాపార లోకములో ప్రొఫెషనల్ తర్ఫీదు కార్యక్రమాలు నైపుణ్యతగల వృత్తిలో పనిచేయుటకు వ్యక్తిని సిద్ధపరుస్తాయి. ఆ కార్యక్రమాలు డిగ్రీలను అందించవు, కాని ఆ వ్యక్తి తర్ఫీదు పొందాడు అను సర్టిఫికేట్ ను ఇస్తాయి. అదే విధముగా, SGC కార్యక్రమము కూడా పరిచర్య కొరకు ప్రొఫెషనల్ తర్ఫీదు అయ్యున్నది.

## అవసరమైన సామగ్రి

కోర్సులతో పాటుగా కేవలం బైబిలు మాత్రమే అవసరమవుతుంది, కాని కోర్సులు తదుపరి అధ్యయనం కొరకు అదనపు మెటీరియల్ ను ప్రతిపాదించవచ్చు. విద్యార్థులు ఉపయోగించుటకు స్థానిక ఇన్స్టిట్యూట్ ఒక గ్రంథాలయమును అభివృద్ధిచేయుటకు ప్రయత్నించాలి.

## తరగతి షెడ్యూల్

స్థానిక పరిస్థితుల ఆధారంగా, స్థానిక ఇన్స్టిట్యూట్ తరగతుల కొరకు సొంత షెడ్యూల్ ను కలిగియుండవచ్చు. అయితే, కావలసినంత సమయమును కేటాయించాలి. సంభాషణ మరియు విద్యార్థుల అభ్యాసము లేకుండా బోధకుడు కేవలం విషయములను మాత్రమే బోధిస్తే, తక్కువ సమయం గడుపుట జరుగుతుంది, కాని తరగతి విద్యార్థులను సరియైన రీతిలో సిద్ధపరచలేదు. సమూహము విషయములను మరియు పూర్తిచేయబడిన అభ్యాసములను చర్చిస్తూ సమయము గడిపితే, కోర్సు పూర్తిచేయుటకు ముప్పైగంటల కంటే ఎక్కువ తరగతిలో గడపవలసియుంటుంది. తరగతి వెలుపల అభ్యాసములను చేయుటకు విద్యార్థులు అదనపు సమయమును గడపాలి.

## కోర్సుల క్రమము

ఒక క్రమము అవసరములేదు. ప్రతి తరగతి సంపూర్ణమైనది మరియు కొనసాగుటకు మరొక తరగతి మీద ఆధారపడదు. కార్యక్రమమును ఒక క్రమములో నడుపుతూ, ప్రతి కోర్సు యొక్క ఆరంభములో క్రొత్త విద్యార్థులు చేరుటకు అనుమతించవచ్చు. సంవత్సరము ఆరంభమైయ్యే వరకు వారు వేచియుండకుండా ఒక ఇన్స్టిట్యూట్ క్రొత్త విద్యార్థులను చేర్చుకోవచ్చు. ప్రతి కోర్సు యొక్క ఆరంభములో వ్యక్తిగత విద్యార్థులు చేరి, వారు కోర్సులన్నిటిని ముగించు వరకు ఆ క్రమములో కొనసాగుతారు.

## నైపుణ్యతను నియంత్రించుట

విద్యార్థుల హాజరు యొక్క రికార్డులను బోధకుడు పాటించాలి. కనీసం 75 శాతం తరగతులకు హాజరుగని, నూరు శాతం అవసరమైన అభ్యాసములను పూర్తి చేయని విద్యార్థులు కోర్సులో ఉత్తీర్ణులు కాకూడదు. కొన్ని విశేష పరిస్థితులలో, తరగతికి హాజరుకాని పక్షమున దానికి ప్రత్యామ్నాయంగా బోధకుడు అదనపు అధ్యయన అవసరతలను ఇవ్వవచ్చు.

చివరి గ్రేడు న్యాయముగాను, ఖచ్చితముగాను ఉండుటకు బోధకుడు విద్యార్థులు పూర్తిచేసిన అభ్యాసముల యొక్క నివేదికలను జాగ్రత్తగా భద్రపరచాలి. వారి అభ్యాసములు లేక హాజరు వారి గ్రేడులను తగ్గిస్తుందేమో విద్యార్థులకు తెలిసియుండునట్లు బోధకుడు చూచుకోవాలి.

స్థానిక ఇన్స్టిట్యూట్ సంస్థల అసోసియేషన్ లో భాగమైయుంటే, ప్రాంతీయ తర్ఫీదుదారులు పరీక్షించుట కొరకు హాజరు మరియు అభ్యాసముల నివేదికలు అందుబాటులో ఉండాలి. సంస్థ తరచుగా అవసరతలను పూర్తిచేయలేకపోతే, సర్టిఫికేట్ కు విలువ ఉండదు.

## స్థానిక ఆర్థిక మద్దతు

ప్రతి స్థానిక ఇన్స్టిట్యూట్ స్థానికంగా నడిపించబడాలి. స్థానిక సంఘము తరగతి గదిని ఇస్తుంది. బోధకులు స్థానిక పరిచర్యలో భాగముగా సేవిస్తారు. కోర్సులను ప్రింట్ చేయు ఖర్చును స్థానిక పరిచర్య లేక విద్యార్థులు భరిస్తారు. ఒక ఇన్స్టిట్యూట్ ఒక సంస్థల అసోసియేషన్లో భాగమైయుంటే, కోర్సులను ప్రింట్ చేయుటకు మరియు స్థానిక ఇన్స్టిట్యూట్ స్టాఫ్ కు జీతమిచ్చుటకు కేంద్ర పాలకవర్గం విద్యార్థుల యొద్ద కొంత ఫీజును తీసుకోవచ్చు.

ఆర్థిక విషయములన్నిటిలో స్థానిక ఇన్స్టిట్యూట్ స్టాఫ్ నిజాయితీగా, పారదర్శకముగా ఉండాలి (2 కొరింథీ. 8:21). ఎంత డబ్బు సేకరించబడింది మరియు దానిని ఎలా ఖర్చుపెట్టుట జరిగిందో అందరికి తెలిసియుండాలి. నిధులను నిర్వహించుటకు ఒక కమిటీ అవసరం. ఆర్థిక విషయముల యొక్క ఉదాహరణలు ఏవనగా, స్థానిక ఇన్స్టిట్యూట్ లేక కేంద్ర పాలకవర్గమునకు విద్యార్థులు చెల్లించు ఫీజు, కోర్సులను ప్రింట్ చేయు ఖర్చు, స్థానిక బోధకుల మద్దతు, సేకరించబడిన మరియు ఖర్చుపెట్టిన ఇతర ధనము.

క్రైస్తవ ప్రవర్తనలో నిజాయితీ ఒక మౌలిక గుణము కాబట్టి, నిజాయితీలేని వ్యక్తి మంచి క్రైస్తవ ఉదాహరణగా ఉండుట సాధ్యము కాదు. నిజాయితీలేని వ్యక్తి ఏ విధమైన పరిచర్య స్థానమును పట్టుకొనియుండకూడదు. ప్రతి విధమైన నిజాయితీలేని కార్యము SGC తో నాయకుని యొక్క సంబంధమును ప్రభావితము చేస్తుంది.

## ఒక మిషన్ సంస్థ/జాతీయ పరిచర్య మరియు స్థానిక ఇన్స్టిట్యూట్ యొక్క భాగస్వామ్యం

స్థానిక ఇన్స్టిట్యూట్లను స్థాపించుటలో సంఘములకు సహాయము చేయు జాతీయ పరిచర్యను ABC అని పిలుద్దాము. స్థానిక ఇన్స్టిట్యూట్ల కొరకు ABC ఉపయోగించు సైట్ ఒప్పందము క్రింద పేజీలో ఇవ్వబడినది. ABC ప్రతినిధులు స్థానిక ఇన్స్టిట్యూట్ సైటులను తరచుగా దర్శిస్తూ, ఈ అధ్యాయము యొక్క చివరి పేజీలో ఇవ్వబడిన ప్రశ్నలను అడుగుతారు.

# నమూనా సైట్ ఒప్పందం

*వారి **జాతీయ పరిచర్య** మరియు **స్థానిక ఇన్స్టిట్యూట్** మధ్య ఉన్న సంబంధమును వివరించుటకు ABC ఈ ఫారంను ఉపయోగిస్తుంది.*

పరిచర్య నాయకులను అభివృద్ధి చేయుటలో సంఘమును సిద్ధపరచుట ద్వారా క్రీస్తు శరీరమును సేవించుట ABC యొక్క ఉద్దేశ్యమైయున్నది. SGC కోర్సులను ఉపయోగించి పరిచర్య తర్ఫీదు కార్యక్రమమును నడిపించుటకు స్థానిక సంఘము లేక పరిచర్య సంస్థకు అమోదమును ఇవ్వవచ్చు.

స్థానిక పరిచర్య దాని యొక్క సమర్పణలను నెరవేర్చని పక్షమున ఒప్పందమును విరమించుకొను అధికారం ABCకి ఉంది.

## ABC ఈ క్రిందివాటిని ఇస్తుంది:

- 20 పరిచర్య తర్ఫీదు కోర్సుల సెట్
- బోధకులకు తర్ఫీదు సెమినార్
- స్థానిక బోధకులను ప్రోత్సహించుటకు మరియు నైపుణ్యతను బలపరచుటకు పరిపాలక బృందం తర్ఫీదు ఇచ్చు స్థలమును దర్శిస్తుంది
- ప్రతి కోర్సు ముగించబడిన తరువాత విద్యార్థులకు సర్టిఫికేట్లు (సర్టిఫికేట్ ను పొందుటకు కోర్సు యొక్క వ్యక్తిగత కాపీ ప్రతి విద్యార్థికి ఇవ్వవలసియున్నది)
- కార్యక్రమము అంతటిని పూర్తిచేసినందుకు సర్టిఫికేట్
- పరిచర్య స్థలములో ABC పోస్టర్

## స్థానిక పరిచర్య వీటికి కట్టుబడియున్నది:

- నమ్మకమైన, అర్హతగల స్థానిక బోధకులను ABC పరిపాలక బృందము యొక్క ఆమోదముతో నియమించుట
- ABC పరిపాలక బృందం యొక్క తర్ఫీదు మరియు నిర్దేశనములకు అనుగుణంగా బోధకులను తర్ఫీదు చేయుట
- మంచి అధ్యయనమునకు అనుగుణంగా ఉండు తరగతిగదిని ఇచ్చుట
- అవసరత కొలది స్థానిక బోధకులకు ఆర్థికంగా మద్దతునిచ్చుట
- ప్రతి కోర్సు కాపీ కొరకు ఫీజును సేకరించి ABC కి పంపుట
- విద్యార్థుల హాజరు మరియు పూర్తిచేయబడిన అభ్యాసముల నివేదికలను ABC పరిపాలక బృందమునకు అందించుట
- ABC ఇచ్చిన పోస్టర్ ను అతికించుట. ఆ పోస్టర్ ABC యొక్క ఆస్తి అయ్యున్నది మరియు ఒప్పందము ఒకవేళ తెగిపోతే దానిని తొలగించవలసియుంటుంది.

స్థానిక పరిచర్య యొక్క పేరు ________________________________

స్థానిక పరిచర్య ప్రతినిధి యొక్క సంతకం ____________________________

ABC అధికారిక ప్రతినిధి యొక్క సంతకం _________________________

## స్థానిక ఇన్స్టిట్యూట్ తనిఖీ కొరకు నమూనా ప్రశ్నలు

*ABC ప్రతినిధులు స్థలమును సందర్శించినప్పుడు, పరీక్షించుటకు మరియు మార్పుచేర్పుల కొరకు ఈ క్రింది ప్రశ్నలను ఉపయోగిస్తారు.*

1. సైట్ బోధకులు SGC బోధకుని తర్ఫీదును పొందారా?
2. బోధకులు విభిన్నమైన బోధనా పద్ధతులను ఉపయోగిస్తున్నారా?
3. బోధకులు సంభాషణ మరియు చర్చలలో విద్యార్థులను పాలుపంచుకొనునట్లు చేస్తున్నారా?
4. తరగతిలో అభ్యసించు సహాయక బోధకులను సైట్ అభివృద్ధి చేస్తుందా?
5. తరగతిగది అధ్యయనమునకు సౌకర్యవంతముగా ఉందా (కుర్చీలు, వెలుగు, అంతరాయం మరియు శబ్దములు లేకపోవుట)?
6. అధ్యయనము చేయుచున్న కోర్సు కొరకు ప్రతి విద్యార్థి దగ్గర ఒక వ్యక్తిగత కాపీ ఉందా?
7. అభ్యాసములను పూర్తి చేయు విధముగా విద్యార్థులందరి దగ్గర చదువుటకు మరియు వ్రాయుటకు కావలసినంత సామర్థ్యత ఉందా? (సర్టిఫికేట్ కొరకు అవసరమైన)
8. అభ్యాసములను పూర్తి చేయుటకు వెచ్చించు సమయముగాక ప్రతి కోర్సు కొరకు ముప్పై గంటల తరగతి సమయమును తరగతి అందిస్తుందా?
9. విద్యార్థులు జవాబులను ఇతరుల నుండి లేక పుస్తకముల నుండి చూచి వ్రాయకుండా ఉండునట్లు పరీక్షలు నిర్వహించబడుతున్నాయా?
10. విద్యార్థుల హాజరు యొక్క ఖచ్చితమైన నివేదికను బోధకులు కలిగియున్నారా? (25 శాతం కంటే ఎక్కువ తరగతి సమయమును తప్పిపోవు విద్యార్థి ఆ కోర్సులో ఉత్తీర్ణుడు కాకూడదు.)
11. పూర్తి చేయబడిన విద్యార్థి అభ్యాసముల నివేదికను బోధకులు కలిగియున్నారా? (సర్టిఫికేట్ కొరకు అభ్యాసములన్నిటిని పూర్తి చేయాలి. ప్రస్తుత తరగతులలోని అభ్యాసములను కోర్సు యొక్క చివరిలో విద్యార్థులకు తిరిగి ఇచ్చువరకు విశ్లేషణ కొరకు అందుబాటులో ఉండాలి.)
12. స్థానిక ఇన్స్టిట్యూట్ స్థానిక ఆర్థిక మద్దతు కొరకు ఒక వ్యవస్థను అభివృద్ధి చేస్తుందా?
13. పారదర్శకత మరియు జవాబుదారుతనము కొరకు స్థానిక ఇన్స్టిట్యూట్ ఆర్థిక విషయములను స్థానిక కమిటీ నిర్వహిస్తుందా?

# SGC నుండి ఆన్లైన్ వనరులు

## షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్ యాప్

SGC యాప్ ఆపిల్ స్టోర్ మరియు గూగుల్ ప్లే రెంటిలో అందుబాటులో ఉంది.

అధ్యయనము కొరకు మరియు డౌన్లోడ్ చేసుకొనుటకు యాప్ అన్ని కోర్సులను ఇస్తుంది. ప్రతిది ముగించబడుతుండగా పలు భాషలలోనికి అనువాదములు చేయబడతాయి.

## SHEPHERDSGLOBAL.ORG

డౌన్లోడ్ చేసుకొనుటకు కోర్సులను మరియు ఇతర వనరులను వెబ్సైటు అందిస్తుంది.

## బోధకుని తర్ఫీదు

ఈ స్థానిక ఇన్స్టిట్యూట్ చేతిపుస్తకము ను ఒక డాక్యుమెంట్ గా డౌన్లోడ్ చేసుకోవచ్చు. పలు భాషలలో తర్ఫీదు కోర్సు యొక్క వీడియో ఎడిషన్లు పూర్తి చేయబడుతు అందుబాటులోకి తేబడతాయి.

## స్లయిడ్ షో ప్రెసెంటేషన్లు

ఆంగ్ల స్లయిడ్ షో ప్రెసెంటేషన్లను ఉచితముగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.

## ప్రమోషనల్ వీడియోలు

వెబ్సైటులో SGC నాయకులు, బోధకులు, మరియు విద్యార్థులు కార్యక్రమము యొక్క దర్శనం మరియు ప్రభావమును వర్ణిస్తూ చేసిన వీడియోలు కూడా ఉంటాయి.

## కోర్సుల యొక్క ఆడియో మరియు వీడియో రికార్డింగ్లు

బోధించబడుతున్న కోర్సుల యొక్క ఆడియో మరియు వీడియో రికార్డింగ్లు పలు భాషలలో అందుబాటులోకి తేబడతాయి.

# షెఫర్డ్స్ గ్లోబల్ క్లాసు రూమ్
# కోర్సు వర్ణనలు

## సిద్ధాంతిక పునాదుల కోర్సులు

### క్రైస్తవ నమ్మకములు

ఇది క్రమబద్ధమైన వేదాంతశాస్త్ర కోర్సు, ఇది బైబిలు, దేవుడు, మానవుడు, పాపం, క్రీస్తు, రక్షణ, పరిశుద్ధాత్మ, సంఘము, మరియు అంత్యదినములను గూర్చిన క్రైస్తవ సిద్ధాంతములను వర్ణిస్తుంది.

### రోమీయులకు వ్రాసిన పత్రిక

ఈ కోర్సు రోమా పత్రికలో వర్ణించబడిన విధముగా రక్షణ మరియు పరిచర్య వేదాంతశాస్త్రమును బోధిస్తుంది, మరియు సంఘములో వివాదాత్మకముగా ఉన్న అనేక విషయములను చర్చిస్తుంది.

### యుగాంతశాస్త్రము

ఈ కోర్సు దానియేలు మరియు ప్రకటన గ్రంథము అను బైబిలు పుస్తకములను మరియు ఇతఃర ప్రవచన లేఖన భాగములను బోధించి, క్రీస్తు రాకడ, చివరి తీర్పు, మరియు దేవుని నిత్య రాజ్యము వంటి ప్రాముఖ్యమైన సిద్ధాంతములను ఉద్ఘాటిస్తుంది.

### పరిశుద్ధ జీవితము యొక్క సిద్ధాంతము మరియు ఆచరణ

దేవుడు ఆశించు మరియు క్రైస్తవుని బలపరచు పరిశుద్ధ జీవితమును బైబిలు వర్ణించు విధానమును ఈ కోర్సు తెలియజేస్తుంది.

### సంఘము యొక్క సిద్ధాంతము మరియు ఆచరణ

సంఘము కొరకు దేవుని రూపకల్పన మరియు ప్రణాళికను మరియు బైబిలు అంశములైన సంఘ సభ్యత్వము, బాప్తిస్మము, సహవాసము, దశమభాగము, మరియు ఆత్మీయ నాయకత్వమును ఈ కోర్సు వివరిస్తుంది.

## బైబిల్ సర్వే కోర్సులు

### పాత నిబంధనను విశదీకరించుట

పాత నిబంధనలోని 39 పుస్తకములలోని ప్రాముఖ్యమైన విషయములను మరియు బోధనలను ఈ కోర్సు బోధిస్తుంది.

### క్రొత్త నిబంధన విశదీకరించుట

క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములలోని ప్రాముఖ్యమైన విషయములను మరియు బోధనలను ఈ కోర్సు బోధిస్తుంది.

### బైబిలు వ్యాఖ్యాన నియమములు

దేవునితో మన జీవితమును మరియు సంబంధమును సరియైన రీతిలో నడిపించుటకు కావలసిన బైబిలు వ్యాఖ్యాన నియమములు మరియు పద్ధతులను ఈ కోర్సు బోధిస్తుంది.

## సువార్త ప్రకటన మరియు శిష్యరిక కోర్సులు

### అపోలోజిటిక్స్ కు పరిచయం

ఈ కోర్సు క్రైస్తవ దృష్టికోణము కొరకు వైజ్ఞానిక, చారిత్రిక, మరియు తత్వ ఆధారములను బోధించి, క్రైస్తవ విశ్వాసము తర్కము మరియు వాస్తవికతతో ఏ విధముగా అనుగుణ్యత కలిగియున్నదో చూపుతుంది.

### ప్రపంచ మతములు మరియు అబద్ధ బోధలు

ఈ కోర్సు ఇవాంజెలికల్ విశ్వాసికి పద్దెనిమిది మత సమూహముల యొక్క బోధనలు మరియు వాటికి సరియైన ప్రతిస్పందనలను ఇస్తుంది.

### బైబిలానుసారమైన సువార్త ప్రకటన మరియు శిష్యరికము

సువార్త ప్రకటన విధానములను నిర్దేశించు బైబిలు నియమములను ఈ కోర్సు అందిస్తుంది. ఇది సువార్త ప్రకటన విధానములను వర్ణించి, క్రొత్తగా మారుమనస్సుపొందినవారిని శిష్యులను చేయుటకు పాఠములను అందిస్తుంది.

### ఆత్మీయ నిర్మాణం

యేసు వైఖరులను కలిగియుండుటను, యేసు తండ్రితో అనుబంధము కలిగియున్న విధముగా దేవునితో సంబంధము కలిగియుండుటను, యేసు వలె మనలను మనము తగ్గించుకొనుటను, యేసు యొక్క ఆత్మీయ మరియు వ్యక్తిగత క్రమశిక్షణలను ఆచరించుటను, యేసు వలె శ్రమలను సహించుటను, మరియు యేసు రూపొందించిన క్రైస్తవ సమాజములో (సంఘములో) పాలుపంచుకొనుటను ఈ కోర్సులో విద్యార్థులు నేర్చుకుంటారు.

### ఆచరణాత్మక క్రైస్తవ జీవనము

ఈ కోర్సు డబ్బును ఉపయోగించుట, సంబంధములు, పర్యావరణం, ప్రభుత్వముతో సంబంధములు, మానవ హక్కులు, మరియు ఇతర ఆచరణాత్మక జీవన విధానములకు లేఖన నియమములను అనువర్తిస్తుంది.

### క్రైస్తవ వివాహం మరియు కుటుంబము

ఈ కోర్సు జీవితములోని పలు స్థాయిల ద్వారా మానవ అభివృద్ధికి క్రైస్తవ దృష్టికోణమును అందించి, కుటుంబ భూమికలు మరియు సంబంధములకు ఆత్మీయ నియమములను అనువర్తిస్తుంది.

## క్రైస్తవ నాయకత్వ కోర్సులు

### పరిచర్య నాయకత్వము

ఈ కోర్సు క్రైస్తవ ప్రవర్తనను ఉద్ఘాటిస్తూ, విలువలను కనుగొనుట, ఉద్దేశ్యమును గ్రహించుట, దర్శనమును పంచుకొనుట, లక్ష్యములను నియమించుట, చర్యలు తీసుకొనుట, మరియు విజయమును అనుభవించుట అను ప్రక్రియ గుండా సంస్థలను ఎలా నడిపించాలో నాయకులకు బోధిస్తుంది.

### యేసు జీవితము మరియు పరిచర్య

ఈ కోర్సు యేసు జీవితమును 21వ శతాబ్దము యొక్క పరిచర్య మరియు నాయకత్వమునకు మాదిరిగా అధ్యయనం చేస్తుంది.

### సంభాషణా నియమాలు

ఈ కోర్సు సంభాషణా వేదాంతశాస్త్రమును, ప్రభావవంతముగా మాట్లాడుటకు పద్ధతులు, బైబిలానుసారమైన ప్రసంగములను సిద్ధపరచుట మరియు చేయుటకు పద్ధతులను బోధిస్తుంది.

### క్రైస్తవ ఆరాధనకు పరిచయం

ఈ కోర్సు ఆరాధన విశ్వాసి జీవితములోని అన్ని కోణములను ప్రభావితము చేయు విధానమును వివరించి, వ్యక్తిగత మరియు సంఘ ఆరాధనా ఆచారములను నడిపించు నియమములను ఇస్తుంది.

## సంఘ చరిత్ర కోర్సులు

### సంఘ చరిత్ర యొక్క సర్వే I

ఆదిమ సంఘము నుండి సంస్కరణ కాలము వరకు సంఘము దాని యొక్క పనిని నెరవేర్చుచు, ప్రాముఖ్యమైన సిద్ధాంతమును భద్రపరచిన విధానమును ఈ కోర్సు వర్ణిస్తుంది.

### సంఘ చరిత్ర యొక్క సర్వే II

సంస్కరణ కాలము నుండి నేటి వరకు సంఘము వ్యాప్తిచెంది సవాళ్లను ఎదుర్కొనిన విధానమును ఈ కోర్సు వర్ణిస్తుంది.